తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాసానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

జూన్ -2023

వెల: ₹20



'స్వాతి' బలరామ్‌గారి విజయ రహస్యం! ✦ ముళ్ళపూడి హాస్య కథల పోటీ ఫలితాలు






KNR PROPERTIES

BUY / SELL / LEASE

890, Hitech City,
Hyderabad- 500 081

Contact:
80000 45500

# KNR PROPERTIES

BUY / SELL / LEASE



Ramakrishna Reddy

Contact:
**80000 45500**

**Address**
890, Hitech City,
Hyderabad- 500 081, Telangana
email: knrproperties54@gmail.com

- కమర్షియల్ బిల్డింగ్స్
- అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్
- ఇండిపెండెంట్ హౌసెస్
- ప్లాట్స్ & ల్యాండ్స్
- విల్లాస్
- ఆఫీస్ స్పేస్



**BANK LOAN AVAILABLE**

జీ'వనం'లో నవ్వు
నవ వసంతం

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక

# హాస్యానందం

**జూన్-2023**

**21వ సంవత్సరం**
**228 వ సంచిక**

*Publisher& Editor-*
*Ramu.P*

*Full Pillar* :
Bnim

*Cartoon Feature Editor*:
Bachi


*D.T.P:*
P. Ramalakshmi, 9440304993

*Digital Media Director:*
Surya


**సంవత్సర చందా-రూ.300/-**
(పోస్టల్ చార్జీలతో)

**2 సంవత్సరాల చందా-రూ.500/-**
(పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా- రూ.5000/-లు**




ముఖచిత్రం: రాశిఖన్నా


*Well Wishers:*
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Dr.V.V.Rama Kumar
Gudibandi Venkata Reddy

*Prize Sponsers*
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
A.V.Krishna Murthy

*Creative Team*
Dr. K.Ramakrishna
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Gandhi
GopalKrishna
Sangram
Krishna
Bomman
Venkat
Dayakar



Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
***Ph*** : **9849630637**

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad.
Cell. 9666680857.



గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది మా అభిమతం కాదు. ఈ పత్రికలో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.


Smile in Every Page...Satisfaction in Every Smile

## శ్రీ ఎ.వి.కృష్ణమూర్తి గారు నిర్వహించిన ముళ్లపూడి సింగిల్‌పేజీ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు


| | | |
|---|---|---|
| ఉత్ప్రేరకం | -సింహప్రసాద్ | -17 |
| హస్త పీడ | -కోనే నాగ వెంకట ఆంజనేయులు | -19 |
| ప్లీజ్ టేక్ కేర్ | -గంగాధర్ వడ్లమన్నాటి | -21 |
| చిదంబరం మావయ్య చిన్ముద్ర | -బలభద్రపాత్రుని ఉదయశంకర్ | -23 |
| హమ్మయ్య పెళ్ళైపోయింది | -పి.వి.రామశర్మ | -25 |
| తెలుగు వెలుగు | -డా॥ చివుకుల పద్మజ | -27 |
| మరువకుమా..! | -యం. రమేష్ కుమార్ | -29 |
| ఇదిగో తోక | -ఎమ్.ఎ.పద్మనాభరావు | -31 |
| నవ్వుతూ బతకాలిరా! | -శ్రీమతి వరలక్ష్మిగున్నయాచారి | -33 |
| ఆనందో అమ్మ | -మన్నవ సిస్టర్స్ | -35 |


న్యాయ నిర్ణేత: **'అక్షజ్ఞ పబ్లికేషన్స్' శ్రీ విద్యావెంకట్**  బొమ్మలు: **మాధవ్**

**గమనిక:** 17 నుండి 36 పేజీల వరకు బయటకు లాగి పిన్ చేస్తే ముళ్ళపూడి కథల పోటీలో గెలుపొందిన కథలతో ఒక చిన్ని పుస్తకం రడీ అవుతుంది!

### కథలు


| | | |
|---|---|---|
| చిత్ర కోరిక ఏనాటికి తీరేనో | -మాధవి బైటారు | -40 |
| రోజీ! | -దినవహి సత్యవతి | -45 |


### శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | -7 |
| తెలుగా మజాకా?! | -డాక్టర్ కప్పగంతు రామకృష్ణ | -12 |
| నవ్వులాట | -గాంధీ మనోహర్ | -14 |
| తర్కారావు కథలు | -గంగాధర్ వడ్లమన్నాటి | -43 |


### స్పెషల్స్


| | | |
|---|---|---|
| వైభవంగా2023 తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం! | | -8 |
| తెలివి | -గోపాలకృష్ణ | -11 |
| ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవం | | -16 |
| విద్దూరం | -బొమ్మన్ | -37 |
| "అదే స్వాతి బలరామ్‌గారి విజయ రహస్యం!" | | -38 |


### సీరియల్


| | | |
|---|---|---|
| ఇందు చందు-నవ్వులవిందు | -కండ్లకుంట శరత్‌చంద్ర | -46 |


### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| డబుల్ ధమాకా | -లేపాక్షి | -15 |
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -18 |
| నవ్వుకొమ్మచ్చి | -సరసి | -20 |
| కోర్టూన్లు | -బాచి | -22 |
| హాస్యబ్రహ్మలు | -అంతోటి ప్రభాకర్ | -24 |
| చేపా చేపా నవ్వించమ్మా | -మల్లాది వెంకటకృష్ణమూర్తి | -28 |
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -30 |
| ఏడువారాల నగలు | -ఎస్వీరమణ(అరుణ్) | -32 |
| కార్టూన్ బరస్ట్ | -వడ్డేపల్లి వెంకటేష్ | -34 |
| తీన్మార్ | -శంకు | -36 |
| నెలనెలా నవ్వుల వెన్నెల | | -44 |


### ఈ సంచికలో కార్టూనిస్టులు

- జయదేవ్
- సరసి
- శంకు
- బాచి
- లేపాక్షి
- గాంధీ
- వర్మ
- గోపాలకృష్ణ
- మోహన్ కుమార్
- చక్రవర్తి
- నాగిశెట్టి
- ప్రసిద్ధ
- రామ్‌శేషు
- శర్మ
- టి.ఆర్.బాబు
- సునీల్
- బొమ్మన్
- అరుణ్
- దాస్
- తోపల్లి ఆనంద్
- వడ్డేపల్లి వెంకటేష్
- భాను
- సునీల్
- దాస్
- పెండేల
- శ్రీఅక్కెర
- రవిశర్మ
- శేఖర్
- క్రిప్
- మణి
- పద్మ
- శేఖర్‌బాబు
- సురేంద్ర


## హాయ్...సానందంగా...



**హాస్యానందం అభిమానులకు...**
**ఆప్తులకు... హాస్యప్రియులకు సన్నిహితులకు**
**హాస్యాభివందనాలు!**

**పళ్ళ చెట్లకే రాళ్ళ దెబ్బలు!**– మనం తరచు వినే సామెత! మన జీవితాలకు ఈ సామెతని అన్వయించుకుంటే సరిగ్గా సరిపోతుంది. మనం పది పనులు చేసినప్పుడు అందులో ఒకటి పొరపాటున తప్పయిందనుకోండి... ఇక అంతే! సరిగ్గా చేసిన తొమ్మిది పనులు వదిలేసి, ఆ 'ఒక్క' తప్పునే ఎత్తి చూపుతూ నానా రభస చేస్తారు. చాలామందికి ఈ 'గుణం' ఉంటుంది. ఎదుటి వాళ్ళలో తప్పులు ఎత్తి చూపడమే తమ నైజంగా ప్రవర్తిస్తుంటారు. వీరి ముఖ్యోద్దేశం ఎదుటివాళ్ళ 'గొప్ప'తనం అంగీకరించలేకపోవడమే! ఉదాహరణకి మనం ఒక గొప్ప వ్యక్తి గురించి చెప్పామనుకోండి...'ఆ అవును నాకతను తెలుసు.. ఎప్పుడూ ఆడవాళ్ళని అదోలా చూస్తుంటాడు. వట్టి వెధవ!' అని పుసుక్కున అనేస్తారు... ఒక్క 'అతనే' మహామనిషిలా ఫీలైపోతూ! మనం ఏం చేసినా అందులో వంకలు వెతకటమే వీరి జీవితాశయంగా ఉంటుంది. మళ్ళీ తప్పు అని చెప్పే వీళ్ళకి 'రైట్' ఏమిటో తెలియదు. ఎలా చేయాలో తెలియదు. ఎదుటివాళ్ళని తక్కువ చేయడమే వీరి మానసిక స్థితి. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ఇలాంటి వాళ్ళ మాటలు విని మనం బాధ పడాల్సిన అవసరం లేదు. మనం 'ఆ' పనిని ఎంత 'సిన్సియర్'గా చేసామో గుర్తెరిగి, అలాంటి 'పొరపాట్లు' మళ్ళీ జరగకుండా జాగ్రత్త పడటమే మన కర్తవ్యం! ఎవరు ఎలాంటి వాళ్ళో... విమర్శలు చేస్తున్న వారి ఉద్దేశం ఏమిటో కాస్త లౌక్యంగా కనిపెట్టగలిగి, వారిని దూరంగా పెట్టగలిగితే మన 'పనులు' ప్రశాంతంగా, ఉత్సాహంగా చేయగలుగుతాం!

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని
కోరుకుంటూ.....







✦ **బి.ఎమ్.పి.సింగ్, విజయవాడ**

**'మే'** నెల సంచిక అచ్చంగా కార్టూన్లతో వెలువడి... ఆంగ్లం కలవని అచ్చ తెలుగులా... నీళ్ళు కలవని 'పాల'లాగా... రాగి కలవని మేలిమి బంగారంలాగ అనిపించి... ఇంకా ఇంకా ఇటువంటి కార్టూన్లు కావాలని నా మనసు 'మారాం' చేసింది. మీ ఈ సంచిక ఎడిటర్‌గారి నూ'తన' ఆలోచనకు అద్దం పట్టింది.

✦ **ఆర్.కృష్ణకుమారి, చెన్నై**

**హా**స్యానందం లాస్ట్ ఇయర్ లాఫులు బావున్నాయి. ముఖచిత్రం బాపుగారి కార్టూన్ చూసి మురిసి పోయామంటే నమ్మండి! పోటీలో గెలిచిన కార్టూన్లు బావున్నాయి. పెద్ద సైజుల్లో ప్రింట్ చేయటం వలన మరింత అందం సంతరించుకుంది. ఇలాంటి పత్రిక మన తెలుగులో వెలువడుతున్నందుకు తెలుగు పాఠకులుగా మేము గర్వ పడుతున్నాం!




✦ **సిహెచ్.పద్మజ,ముంబై**

**మే** హాస్యానందం కార్టూన్ల ప్రత్యేక సంచిక నావెల్టీకి మారుపేరుగా నిలిచింది. ఒక పత్రికని ఇలా పూర్తిగా కార్టూన్లతో రూపొందించవచ్చని నిరూపించిన హాస్యానందం నిజంగా గ్రేట్! ఈ సంచికలో మన తెలుగు కార్టూనిస్టుల సత్తా ఏపాటిదో చాటిందనే చెప్పాలి. కార్టూనిస్టులకు ఒక మంచి వేదిక ఏర్పరచిన మీకు అభినందనలు.

✦ **మళ్ళా రవికిరణ్, విశాఖపట్టణం**

**హా**స్యానందం పేరుకు తగ్గట్టు హాస్యంతో ఆనందాన్ని పంచుతూ మమ్మల్ని నవ్వుల జల్లులో తడుపుతుంది. మండుటెండలో మల్లెల పరిమళంలా మే సంచిక అలరించింది. ఇందులో ప్రచురించిన కార్టూన్లన్నీ బావున్నాయి. పత్రిక నిర్వహణలో మీరు చూపుతున్న శ్రద్ధ హాస్యానందంకి శ్రీరామరక్ష! పత్రికలు తెరమరుగైపోతున్న ఈ రోజుల్లో టంచనుగా ప్రతినెలా ఒకటవ తేదీన విడుదల చేస్తున్న మీ కృషికి అభినందనలు.

**కీ.శే.తోరహతుల వెంకటరత్నం శ్రీమతి వనజాక్షమ్మ దంపతుల పురస్కారం-2023**

**&**

**కీ.శే.తోరహతుల నాగేశ్వరరావు పురస్కారం-2023**

**కార్టూన్ పోటీల ఫలితాలు వచ్చే సంచికలో**




# ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో ప్రతి నెలా హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**




కార్టూన్ ఇష్టులు
**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**
**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.



కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.








# వైభవంగా 2023 తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం!

**ఆనందం...** ఉల్లాసం... పలకరింపులు... తెలుగు కార్టూనిస్టులందరూ సందడి చేసిన సందర్భం! డా॥కె.వి.రమణగారి ఆశీస్సులతో, హాస్యానందం, సత్కాళా భారతి, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించిన **12వ 'తెలుగు కార్టూనిస్ట్ల దినోత్సవం'** మే 20 సాయంత్రం హైదరాబాద్, రవీంద్ర భారతి సమావేశ మందిరంలో వైభవంగా జరిగింది.

ఇది మన పండుగ అని... దేశం నలుమూలల నుండి తెలుగు కార్టూనిస్టులు, కార్టూన్ ఇష్టులు ఈ నవ్వుల పండుగకు విచ్చేసారు.

ఈ సభకు ముఖ్య అతిథులుగా– తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు– డాక్టర్ కె.వి.రమణ, ప్రముఖ నటులు, దర్శకులు శ్రీ ఎల్బీశ్రీరాం, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీదైవజ్ఞశర్మ, ప్రముఖ సాహితీవేత్త– శ్రీ అక్కిరాజు సుందర రామకృష్ణ, యువకళావాహిని అధ్యక్షులు శ్రీ లంక లక్ష్మీనారాయణ, ప్రముఖ కార్టూనిస్టులు శ్రీ సరసి, శ్రీ మృత్యుంజయ, బాపూరమణ అకాడమీ కార్యదర్శి శ్రీ వి.సుబ్బరాజు పాల్గొన్నారు.

ఈ సభ కార్యక్రమాన్ని శ్రీ వాడ్రేవు శ్రీనివాసరావుగారి ఆధ్వర్యవంలో దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం గావించారు.

శ్రీ బి.ఎస్.శర్మగారు ఆద్యాంతం ఆహ్లాదకరంగా ఈ సభని నిర్వహించారు.



# పుస్తక ఆవిష్కరణలు



**జయదేవ్‌రాజలక్ష్మి కార్టూన్ అకాడమీ** సమర్పించగా
హాస్యానందం ప్రచురించిన **'గోపాలకృష్ణ కార్టూన్లు'**
పుస్తకావిష్కరణ



**'అక్షజ్ఞ పబ్లికేషన్'** ప్రచురించిన
శ్రీముళ్ళపూడి వెంకటరమణ కథల సంపుటి
**'జనతా ఎక్స్‌ప్రెస్'** పుస్తకావిష్కరణ

# పురస్కారాలు



**తలిశెట్టి రామారావు పురస్కారం-2023** విజేత
**శ్రీశర్మ, విశాఖపట్టణం (మొదటి బహుమతి)**



**బాపురమణ పురస్కారం-2023** విజేత
**శ్రీ వడ్డేపల్లి వెంకటేష్,మిర్యాలగూడ**

డాక్టర్ కె.వి.రమణగారి ఆశీస్సులతో, హాస్యానందం నిర్వహించిన కార్టూన్ పోటీ విజేతలకు, బాపూరమణ అకాడమీ సమర్పించిన 'బాపురమణ పురస్కారం'- ముఖ్య అతిథులు అందజేసారు.

ఈ సభలో... ప్రముఖ కార్టూనిస్టు శ్రీ జయదేవ్‌గారు స్థాపించిన 'జయదేవ్ రాజలక్ష్మి కార్టూన్ అకాడమీ' సమర్పించిన **'గోపాలకృష్ణ కారూన్లు'** పుస్తకం డా॥ కె.వి.రమణగారు ఆవిష్కరించారు.

అక్షజ్ఞ పబ్లికేషన్ ప్రచురించిన శ్రీముళ్ళపూడి వెంకట రమణగారి **'జనతా ఎక్స్‌ప్రెస్'** పుస్తకం శ్రీఎల్బీశ్రీరాం ఆవిష్కరించగా, తొలి ప్రతిని ప్రచురణకర్త శ్రీ విద్యావెంకట్ అందుకున్నారు.

సభకి ముందు... అల్పాహారం, సమ్మర్ స్పెషల్ 'మామిడి పండ్ల రసం' హాస్యానందం వారు అందించారు.

**-వావిలాల పవన్ కుమార్, హైదరాబాద్**



**శేఖర్ అవార్డు-2023** విజేత **శ్రీ సాయికృష్ణ,నెల్లూరు**

# తలిశెట్టి రామారావు స్మారక కార్టూన్ పోటీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం



రెండవ బహుమతి- శ్రీ కృష్ణ, హైదరాబాద్



మూడవ బహుమతి- శ్రీ డి.శంకర్, కోరుట్ల

## ప్రత్యేక బహుమతులు



శ్రీ బాచి, విజయవాడ



శ్రీ గోపాలకృష్ణ, పెనుగొండ



శ్రీ రామ్‌శేషు, నెల్లూరు



శ్రీ ప్రసాద్ కాజ, హైదరాబాద్



శ్రీ ఆదినారాయణ, విజయవాడ



శ్రీ ప్రసిద్ధ, హైదరాబాద్



శ్రీ ప్రభాకర్, హైదరాబాద్



శ్రీ రంగాచారి, హైదరాబాద్



శ్రీ ఎమ్.రాము, బండారులంక



శ్రీ సముద్రల, హైదరాబాద్



శ్రీ చక్రవర్తి, గుడివాడ



కుమారి ప్రణు, హైదరాబాద్



శ్రీ గిరి, కాకినాడ



శ్రీ సునీల్, అమలాపురం




శ్రీ జెఎన్నెమ్, బెంగళూరు



శ్రీ పుష్ప, విజయవాడ

# తెలివి

కథ-బొమ్మలు: గోపాలకృష్ణ






**ఆధునికత పెరిగిన ఇప్పటి తరంలో భాష కూడా ఎన్నో ఆధునిక పోకడలు పోతోంది. దీని వల్ల అర్థాలు మారి అనర్థాలు జరుగుతున్నాయి. తెలుగు మాట్లాడే క్రమంలో జరిగే పొరపాట్లు, వాటివల్ల జరిగే తప్పులు, వాటిని సరిచేసుకోవాల్సిన విధానాలు అందరికీ తెలియజేయాలనే సంకల్పంతో... భాషా చమత్కారాన్ని ఉపయోగిస్తూ చేస్తున్న ప్రయత్నం ఇది.**

డాక్టర్ కప్పగంతు రామకృష్ణ
*ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ పాలక మండలి సభ్యులు*
90320 44115

**(ఏప్రిల్ సంచిక తరువాయి)**

**ఆ** రోజు ఆదివారం కావడంతో ఇంట్లోనే ఉన్నా. మా పెద్దనాన్నగారి అబ్బాయి శివాజీ దంపతులు వచ్చారు.


తమ్ముడిని చూసి చాలాకాలం కావడంతో ఎంతో ఆనందం వేసింది.

పలకరింపులు అయ్యాక–“ఏదో పిలుపులకు వచ్చినట్లున్నారు... అమ్మాయి పెళ్ళి కుదిరిందా?” అనడిగాను.

“లేదన్నయ్యా! అదింకా చదువుకుంటానంటోంది.నాన్నకేమో అరవయ్యేళ్ళు నిండుతున్నాయి. అందుకని షష్ఠి పూర్తి చెయ్యాలని, నేనూ చెల్లాయి అనుకున్నాం. ఇంట్లో అందరికీ నువ్వే పెద్దవాడివి. దగ్గరుండి మా చేత నువ్వే ఈ కార్యక్రమం చేయించాలన్నయ్యా!” అంటూ చేతిలో ఆహ్వానపత్రిక పెట్టాడు.

ఒక్కసారిగా నా మొహంలో రంగులు మారటం గమనించారు అక్కడి వాళ్ళంతా.

“శివాజీ!” అంటూ శంకరాభరణం సినిమాలో శంకరశాస్త్రి ‘శారదా!’ అని అరిచిన తీరులో గట్టిగా అరిచాను.




“నువ్వు చెయ్యాలనుకున్న పనేమిటి?... రాసిన మాటేమిటి?... ఏం చేస్తున్నావో తెలుస్తోందా! మతి ఉండే ఇదంతా చేస్తున్నావా... పేరుకు పెద్దవాడినన్న హోదా ఇచ్చావు కానీ, నువ్వు చేసిందేమిటి?!” అంటూ ఏదో అనబోతుండగా మహాకాళి ఉగ్రరూపం చల్లార్చటానికి పరమశివుడు అడ్డుపడ్డట్టు మా ఆవిడ నాకు అడ్డుతగిలింది.

వాళ్ళకీ శంకరాభరణం సినిమానే కనిపిస్తోంది.

“చాల్లెండి... పెద్దంతరం, చిన్నంతరం లేకుండా ఏమిటా గద్దరింపు. మీ తమ్ముడేమైనా మీ బడిలో పిల్లాడనుకున్నారా?! కస్సుమని ఎగురుతున్నార”ంటూ తుస్సుమని నా గాలి తీసింది.

“అది కాదే... **షష్ఠి** అంటే ఆరు అని అర్థం. **షష్టి** అంటే అరవై అని అర్థం. పెద్దనాన్నకి అరవయ్యేళ్ళు నిండాయి కాబట్టి, షష్టి అని రాయాలే కానీ షష్ఠి అని రాయకూడదు” అంటూ వివరం చెప్పబోయాను.

“అన్నయ్యా....” అంటూ శివాజీ నావైపు వేడుకోలుగా చూసాడు.

“ఉండవయ్యా... భోజనం చేసి వెళ్దువుగాని...” అంటూ మా ఆవిడ ఎంత చెబుతున్నా... ‘కడుపు నిండిందంటూ’ వాడూ, అమ్మాయి వెనక్కి తిరిగిచూడకుండా బయల్దేరారు. జరుగబోయే ప్రళయాన్ని ఊహించి, నేను కూడా అక్కడి నుంచి జారుకున్నా.

✦✦✦

నాతో పాటే పనిచేసే మాస్టారు కేశవమూర్తి. కాస్తంత పొదుపరి కావడంతో ఉద్యోగంలో చేరిన కొన్నాళ్ళకే ఏదైనా స్థలం కొనాలనుకున్నాడు.

“మాస్టారూ! స్థలం కొందాం అనుకుంటున్నాను. రేపు ఆదివారం. ఎలాగూ బడి లేదు కాబట్టి, రవి రియల్ ఎస్టేట్ వాళ్ళు వేసిన వెంచర్ చూసొద్దాం. మీరూ తోడురండి!” అనడిగాడు.

“సరే...” అంటూ అభయం ఇచ్చాను.

మర్నాడు ఇద్దరం రియల్ ఎస్టేట్ ఆఫీస్‌కి వెళ్ళాం.

తెలిసిన వ్యక్తులు కనబడగానే వారితో స్థలం వివరాలు మాట్లాడటం మొదలుపెట్టాడు మూర్తి.

నేను అటూ ఇటూ దిక్కులు చూస్తున్నా.

ఇంతలోనే అనుకున్నంతా అయ్యింది. ఏది జరగకూడదో సరిగ్గా అదే జరిగింది.

ఎవరైనా, ఏమైనా అనుకుంటారనే ఆలోచన కూడా లేకుండా, ఎవరీ బోర్డు రాసింది? మతి ఉండే రాసారా? అంటూ గట్టిగానే అనేసాను.

అందరూ నావైపే చూడటం మొదలు పెట్టారు.

మూర్తి మాత్రం కొద్దిగా ధైర్యం చేసి...

“ఏమైంది మాస్టారూ...” అంటూ భయం భయంగా నా దగ్గరకు వచ్చాడు. బోర్డు మీద ఏం రాసారో చదువు. 'కాళీ' స్థలాలు, పొలాలు కావాల్సిన వారు సంప్రదించండి అని రాసారు. **కాళీ** స్థలం ఏమిటి? ఇవేమైనా కాళీ అమ్మవారి స్థలాలా? **'ఖాళీ'** స్థలాలు అని రాయాలి...” అంటూ ఇంకా ఏదో అనబోతుండగా, రెండు చేతులెత్తి నమస్కరించాడు మూర్తి.

“మాస్టారూ మీరు కనికరిస్తే ఓ వందగజాల స్థలం కొనుక్కుని బయటపడతా. దయచేసి, మరొక్కమాట మాట్లాడకండి!”... అంటూ మోకాళ్ళ మీద నిలబడి వేడుకుంటున్నాడు మూర్తి.

తెలుగు సినిమాలో చూపించినట్లు నరాల్లో రక్తం ఉప్పొంగుతున్నా, నిగ్రహించుకుని... నాలోని ఉగ్రమూర్తిని నేనే శాంతపరచుకున్నా.

✦✦✦

“ఇలాగైతే కష్టమండీ!... మీరు రాను రాను మరీ శంకరాభరణం శంకరశాస్త్రిని మించి పోతున్నారు... ఇదే తీరు కొనసాగితే మీతో కనీసం పలకరింపుగా కూడా ఎవరూ మాటాడరు.” అంటూ నా భార్య భగవద్గీత బోధిస్తున్న కృష్ణపరమాత్మను స్థాయిలో ఉపదేశం మొదలు పెట్టింది.

ఒకటో తరగతి పిల్లాడు టీచరు ముందు బుద్ధిగా చేతులు కట్టుకుని కాళ్ళు ముడుచుకుని పాఠం వింటున్నట్లు నేను కూడా మౌనంగా 'భార్యాగీత' వింటున్నాను.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగడంతో తలుపు తియ్యడానికి వెళ్ళింది నా శ్రీమతి.


హమ్మయ్య! అంటూ ఊపిరితీసుకున్నా.

పక్కింటి పార్వతీదేవి, ఆమె భర్త వచ్చారు.

ఇద్దరినీ పలకరిద్దామని నేను కూడా హాల్లోకి వచ్చా.

“మాస్టారూ మీరైనా చెప్పండి. శాస్త్రానికి వ్యతిరేఖంగా పెద్దపెద్ద విగ్రహాలు పూజగదిలో పెట్టద్దంటే ఈవిడ నా మాట వినడం లేదు. అసలా ఆలోచనలో స్తిరత్వం కూడా లేదు. నన్ను చాలా ఇబ్బంది పెడుతోంది”... అంటూ బాధలన్నీ ఏకరువు పెట్టాడు.

“శర్మగారూ! ముందుగా మీ ఆలోచనలో **'స్థిరత్వం'** రావాలండి. **'స్తిరత్వం'** అని తేలికగా పలకకూడదు. అలాగే, ఆమె ఏ పనీ శాస్త్రానికి వ్యతిరేఖంగా చెయ్యటం లేదు. ఎందుకంటే, **వ్యతిరేఖం** అనే పదం తప్పు. **వ్యతిరేకం** అనాలి. ఆమె వ్యతిరేకంగా చేస్తోంది అనాలి.




**'అమ్మనుడిని అటకెక్కిస్తారా!' సౌజన్యంతో**

అలాగే, ఆమె మిమ్మల్ని **ఇబ్బంది** పెట్టడం లేదు. కేవలం **ఇబ్బంది** పెడుతోందంతే! 'ఇబ్బంది' అనే పలకాలి శర్మగారూ!” అంటూ ఇంకా ఏదో చెప్పబోతూ...సదరు మనిషి కన బడటం లేదేమిటా అంటూ ఆశ్చర్యపోయా.

అప్పటికే సాష్టాంగపడి, నా కాళ్ళు పట్టు కున్నాడు శర్మగారు.

“అయ్యా!... మరోసారి మీ ఇంటికి వస్తే చెప్పు తీసుకుని తన్నండి. ఏమీ అనుకోను. మీరు పెట్టే బాధ కన్నా మా ఆవిడ పెట్టే బాధే సుకంగా ఉంటుంది అంటూ ఇంకా ఏదో చెప్పబోతుండగా...

“అది **సుకం** కాదయ్యా, **'సుఖం'** అనాలి!” అన్నాను! అంతే... సెకనులో దంపతులు మాయం అయ్యారు.

అప్పుడాల కర్రతో మా ఆవిడ సిద్ధంగా ఉన్నట్లు గమనించి, మరు నిమిషంలో నేను కూడా బజారు బాట పట్టాను.

✦✦✦

“మాస్టారూ... మా లైబ్రరీ వారోత్సవాలు చేస్తున్నాం. మొదటి రోజు మీరు సభకు ముఖ్య అతిథిగా రావాలండీ!” అంటూ పూర్వవిద్యార్థి వీర్రాజు ఫోన్ చేసి అడగడంతో సరే అన్నాను.

అనుకున్న రోజు రానే వచ్చింది.

సాయంత్రం బడి నుంచి రాగానే, హడావిడిగా తయారై, చక్కటి లాల్చీ, పైజమా ధరించి సభకు బయల్దేరా.

వేదిక దగ్గరకు చేరుకునే సరికే, నాకోసం వీర్రాజుతో సహా ఇతర కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. అందరూ ఎంతో ప్రేమతో స్వాగతం పలికి, లోపలికి తీసుకెళ్ళారు.

ఇంకేముందీ... నాకంట పడనే పడింది.

వెంటనే వీర్రాజును పిలిచి, మొహమ్మీదే అడిగేసా– “ఏంటయ్యా ఇదీ! **గ్రంధాలయ** వారోత్సవాలు అని బ్యానర్ మీద రాయిం చావు. **గ్రంథాలయం** అని కదా ఉండాలి అంటుండగానే... అతడి ముఖంలో రంగులు మారడం గమనించాను.

**(తరువాత మాస్టరు గారితో వీర్రాజు పాట్లు వచ్చే సంచికలో)**

# నవ్వులాట

గాంధీ మనోహర్, 98490 51846

## దొంగ నోట్లు


**రో**డ్ మీద పడివున్న ఐదొందల రూపాయల నోటుకేసి సంబరంగా చూసి అందుకున్నాడు ఓ వ్యక్తి.

ఎవరూ చూడకుండా ఆ నోటుని తన జేబు లో పెట్టుకుని ఏమీ ఎరగనట్టు అక్కడినుండి వడివడిగా వెళ్ళిపోయాడు.

ఊహించి తనలోతానే నవ్వుకున్నాడు.

దేవానంద్ కు అరవై ఏళ్ళు దగ్గర పడుతున్న ఇంకా పిల్ల బుద్దులు పోలేదు.

ఇలా తన అల్లరి చేష్టలతో అందర్నీ ఫూల్ చేయడమంటే దేవా నందికి భలే సరదా... కాదు వ్యసనం!




ఇదంతా చెట్టు చాటు నుండి గమనిస్తున్న దేవానంద్ ఫక్కున నవ్వేశాడు. ఎందుకంటే అది దొంగ నోటు. తనే అలా రోడ్ మీద కావాలని పడేశాడు. సినిమావాళ్ళు తమ సిని మాల్లో వాడే ఫేక్ నోటు అది. ఎంతో పరిశీ లనగా చూస్తే తప్ప అది దొంగ నోటని ఎవరూ తెల్సుకోలేరు.

రెండు రోజుల క్రితం తన ఫ్రెండ్‌ను కలవ డానికి ఓ సినిమా షూటింగ్‌కు వెళ్ళాడు దేవానంద్. అక్కడ తనకి ఐదొందల ఫేక్‌నోట్స్ తన కంటబడ్డాయి. వాటితో జనాలతో సర దాగా ఆడుకోవచ్చని వాటిని తెచ్చుకున్నాడు

ఇందాక ఆ నోటు తీసుకుని వెళ్ళిన వ్యక్తి దాన్ని ఎవరికైనా ఇస్తే ఏం జరుగుతుందో

అలా నడుచుకుంటూ వెళ్తున్న దేవానంద్‌కు ఓ షాప్ ముందు గొడవ జరుగుతుంటే వెళ్లి చూశాడు. ఇందాక నోటు తీసుకున్న వ్యక్తిని ఓ షాప్ అతను చొక్కా పట్టుకుని-

"నాకే దొంగనోటు ఇచ్చి మోసం చేయాలని చూస్తావారా? పద!... పోలీస్ స్టేషన్‌కి!" అని అంటున్నాడు.

వస్తున్న నవ్వుని ఆపుకుంటూ అక్కనుండి వెళ్ళిపోయాడు దేవానంద్.

అలాంటి దొంగనోట్లు తన దగ్గర చాలా వున్నాయి. వాటిని అక్కడక్కడా పడేసి విజిల్ వేసుకుంటూ ఇంటికి వెళ్ళాడు.

మరుసటి రోజు దేవానంద్ అలా వీధిలో నడుచుకుంటూ వెళ్తూ, ఓ షాప్ దగ్గర ఆగాడు.

ఆ షాప్ ఓనర్ తనకి ఎవడో ఐదొందల దొంగనోటు ఇచ్చి మోసం చేసాడని భాధ పడుతున్నాడు.

అది చూసి హ్యాపీగా నవ్వుకుంటూ అక్కడి నుండి వెళ్ళిపోయాడు దేవానంద్.

దేవానంద్ ఇంటికి వచ్చే సరికి తన భార్య సుకన్య బాధగా వుంది.

కారణం అడిగితే... మొదట చెప్పలేదు. తర్వాత ఏదో దాస్తోందని తెల్సి దేవానంద్ రెట్టించి అడిగే సరికి చెప్పింది.

"పొద్దున్న రోడ్ మీద వెళ్తుంటే నాకు రెండు ఐదొందలు దొరికాయి. అవి దొంగ నోట్లు అని తెల్సినా ఎవరూ కనుక్కోలేరన్న ధైర్యంతో వాటిని మారుద్దామని ఓ షాప్ కు వెళ్లాను. అక్కడ ఇంటికి కావాల్సిన సరుకులు కొనుక్కొని నా దగ్గర వున్న అసలు డబ్బులో ఆ రెండు దొంగనోట్లు కలిపి ఇచ్చాను. కానీ ఆ షాప్ వాడు కనిపెట్టేశాడు. అవి దొంగనోట్లు అని నాకు వెనక్కి ఇచ్చేసి వేరేవి ఇవ్వమని అడుగు తాడనుకున్నాను. కానీ వాడు 'ఇందాకే ఒకడు ఇలాంటి నోట్లే నాకు ఇచ్చి నన్ను మోసం చేయ బోయాడు. వాడ్ని పట్టుకుని పోలీసులకు అప్ప జెప్పాను.' అని నన్ను పట్టుకుని పోలీసులకు ఫోన్ చేశాడు. వాళ్ళు వచ్చి 'ఆడదానివని వదిలే స్తున్నాం... ఇలా మోసం చేయడాని సిగ్గుగా లేదా?' అని అందరి ముందూ నన్ను అవ మానించారు. అంతే కాకుండా ఇంతలో ఆ షాప్ ఓనర్ భార్య వచ్చి... 'ఇలాంటి వాళ్ళను ఊరికే వదిలేయకూడదు' అని నా మీద దబా దబా నాలుగేట్లు వేసింది. తప్పు చేశాను కాబట్టి ఎదిరించలేకపోయాను." అని ఏడుపు ఆపు కుంటూ...

"ఇంతలో ఎవరో మీ ఫ్రెండట వచ్చి నన్ను గుర్తుపట్టి వాళ్లకు సర్ది చెప్పి నన్ను అక్కడినుండి పంపేశాడు." అని జరిగిన ఇన్సిడెంట్ ని చెప్పి భోరున ఏడ్చేసింది సుకన్య.

తను చేసిన నిర్వాకం వల్లే ఇదంతా జరిగిం దని దేవానంద్‌కు చెప్పలేని పరిస్థితి.

ఇంతలో దేవానంద్‌కు పోలీస్‌స్టేషన్ రమ్మని ఫోన్ వచ్చింది.

ఎందుకు అని అడిగినా సమాధానం చెప్ప కుండా కాల్ కట్ చేశారు.

ఏం జరిగి ఉంటుందా అని ఆటోలో వెళ్తున్నంత సేపూ ఆలోచించుకుంటూ వెళ్ళాడు.

పోలీస్ స్టేషన్‌లోకి వెళ్ళగానే అక్కడ బాగా దెబ్బలు తిన్న తన కొడుకు కనిపించాడు.

కొట్టడం వల్ల మొహం వాచిపోయి వుంది.

"మీ వాడికి దార్లో ఎక్కడో ఐదొందల నోట్లు దొరికితే వాటిని మార్చాలని చూశాడట. దాంతో షాప్‌వాడు పట్టుకుని చితగ్గొట్టి మాకు అప్పజెప్పారు." అని పోలీసువాళ్లు అన్నారు.

"ఎంతో కొంత ఇచ్చి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాక ముందే మీ వాడ్ని తీసుకెళ్ళిపొండి. లేకపోతే అనవసరంగా కేసు ఫైల్ చేస్తారు." అని సబ్‌ఇన్స్‌పెక్టర్ అన్నాడు.

చేసేదేమీలేక వాళ్ళకు రెండు వేలు ఇచ్చి... తన కొడుకుని తీసుకుని అక్కడినుండి బయట పడ్డాడు దేవానంద్.

'చెరపకురా చెడేవు... తానూ తీసిన గొతిలో తానే పడతాడు' లాంటి కథలు చిన్నప్పుడు చందమామలో చదువుకున్నవి ఇప్పుడు దేవానంద్‌కు గుర్తుకు వచ్చాయి.

తన కొడుకుని తీసుకుని ఇంటికి వచ్చాడు దేవానంద్.

✦ ✦ ✦


తన కూతురు డల్‌గా వుంది.


కారణం అడిగాడు.


కూతురు చెప్పకపోవడంతోభార్య సుకన్య చెప్పింది.

'ఇది బస్ స్టాప్‌లో వుంటే ఒకతను తన పర్సులోనుండి ఓ పది దాకా ఐదొందల నోట్లు తీసి, కౌంట్ చేసుకుని మళ్ళీ పర్సులో పెట్టుకున్నాడట. దీని దగ్గర రెండువేల రూపాయలు మూడు నోట్లు ఉండేవట... అవి కొన్నాళ్ళలో చెల్లవని అవి అతనికి ఇచ్చి ఇదొందలు తీసుకుందట. ఇది ఇంటికి వచ్చాక చూసుకుంటే ఇవి దొంగ నోట్లు అని తెల్సిందట.' అని అక్కడ నెల మీద పడేసి వున్న ఆ దొంగ నోట్లని చూపెట్టింది సుకన్య.

తాను చేసిన నిర్వాకం వల్ల తన ఫ్యామిలీ మీద ఇంత ఎఫెక్ట్ చూపిస్తుందని దేవానంద్ కలలో కూడా ఊహించలేదు.



# ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవం

**మే,7** వతేదీన ప్రపంచ కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా ఒడిస్సాలోని భువనేశ్వర్‌లో బుద్ధ గ్యాలరీలో 20మంది కార్టూనిస్టుల 200 కార్టూన్లు, క్యారికేచర్ల తో ప్రదర్శన నిర్వహించారు.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, డెంకానల్ ప్రాంతీయ సంచాలకులు శ్రీ మ్రినాల్ చటర్జీ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఆయన మాట్లాడుతూ–" భవిష్యతులో జాతీయ, రాష్ట్ర స్థాయిలో కార్టూనిస్టులను ప్రోత్సాహిస్తూ కార్యక్రమాలను చేపడతామ"ని అన్నారు.

ఈ కార్యక్రమానికి బి.బి.సి రిపోర్టర్ శ్రీ సంపద్ మహాపాత్రో పాల్గొన్నారు.















# ఉత్తేరకం

సింహప్రసాద్-9849061668





ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**గౌరీ శంకరుల పెళ్లి అయి ఏడాది దాటింది. అతడి మందకొడితనం, నిర్లిప్తత, ఉత్సాహలేమి ఆమెకు బొత్తిగా మింగుడు పడటం లేదు. విసుగ్గానూ వుంటోంది.**

**"అతడో జడ పదార్థం!" అని మిత్రురాలి దగ్గర వాపోయింది.**

**ఆమె ఓ సలహా ఇచ్చింది.**

"పని చేస్తుందంటావా ?"

"దాన్ని మించిన అద్భుత ఔషధం భూమ్మీద లేనే లేదు!"

"బెడిసి కొట్టదు కదా!"

"అది నీ నటన మీద ఆధారపడి ఉంటుంది!"

శంకరం నిద్రకు ఉపక్రమిస్తూండగా అంది గౌరి– "పొద్దుట మా ఫ్రెండ్ ఇంట్లో మీ క్లాస్మేట్ కనిపించిందండీ! "


"హైస్కూల్ క్లాస్ మేటా? కాలేజీ క్లాస్‌మేటా!"

"కాలేజీయే అయ్యుంటుంది. మీ గురించి చాలా చెప్పు కొచ్చింది లెండి...!" అతన్ని పరిశీలనగా చూస్తూ అంది.

కంగారు పడ్డాడు.

"సుజాత కాదు కదా?"

"అవును, ఆమెనే!"



"ఏమంది?" ఉత్కంఠతో ఊగిపోయాడు.

"అప్పట్లో మీలో హుషారే ఉండేది కాదని చెప్పింది. ఇప్పటికీ సుద్ద పప్పులానే ఉంటున్నాడా–అని నొక్కి మరీ అడిగింది. లేదు... లేదు, చాలా డైనమిక్‌గా ఉంటున్నారని సొరకాయలు పరపరా కోసేసాను!"

"బతికించావు... ఇంకేం చెప్పింది?"

"మీరు తననే చూస్తూ వుండేవారట తప్ప... ఎప్పుడూ పలకరించే వారు కాదుట... అసలు మీలో చొరవే వుండేది కాదుట. అంతా గులాబీలూ గట్రా ఇచ్చి సినిమాలకీ షికార్లకీ ఆహ్వానించేవారుట... మీరేమో మూగ ప్రేక్షకుడిలా చూస్తూ ఉండటమే తప్ప ఎలాంటి భావోద్వేగాలూ వ్యక్తీకరించే వారు కాదుట... ఆమె మిమ్మల్ని బాగా ఇష్టపడేదట. అందుకని మిమ్మల్నే అబ్జర్వ్ చేస్తూ ఉండేదట. మీరు ఆమె ఫీలింగ్స్ గ్రహించి, ప్రేమించానని చెబుతారని ఎంతగానో ఆశించిందట... కానీ మీలో పేరుకు పోయిన స్తబ్దత కించిత్తు కరగ లేదుట!"

"నిజమా! అప్పట్లో ఆమె కోసం ఎందరో పడి చచ్చే వారు. అలాంటి ఆమె నన్ను ఇష్టపడిందా! నమ్మలేక పోతున్నాను!"

"అక్షరాలా నిజం స్వామీ... మీరు చలాకీగా వుంటే, చొరవగా ప్రవర్తించి ఉంటే ఐ లవ్ యు చెప్పేదాన్ని అని కూడా చెప్పింది. నీకైనా ఏప్పుడైనా చెప్పాడా –అని నన్ను అడిగే సరికి ఏం చెప్పాలో తోచలేదు..." అమాయకంగా ముఖం పెట్టి అంది.

అతడు మాట్లాడలేదు. దీర్ఘాలోచనలో పడ్డాడు.

మర్నాటి నుంచి శంకరం ముడుచుకుపోవడం మానేసాడు. ఉత్సాహంగా ఉంటున్నాడు. ఆమె వండిన కూర నుంచి కట్టుకున్న చీర వరకు ఆమె తాలూకు సమస్తాన్నీ పొగిడేస్తున్నాడు... షికార్లకీ




సినిమాలకీ తీసుకెళ్తున్నాడు... గిఫ్టులు ఇస్తున్నాడు. జోకులు చెప్పి నవ్విస్తున్నాడు.

గౌరి తన అదృష్టానికి మురిసి పోయింది.

"మీరు కాలేజీ రోజుల్లో ఇలా ఉండక పోవడం నా అదృష్టం. లేకపోతే ఆ సుజాత ఎగరేసుకు పోయేది !" అని చెప్పింది.

దాంతో అతడికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి.

ఒక రోజున బజార్లో హఠాత్తుగా అన్నాడు శంకరం– "అదిగో ఆ జ్యువలరీ షాప్‌కి వెళ్దాం పద! నీకు బర్త్ డే గిఫ్ట్ కొంటాను!"

"నెల తర్వాత వచ్చే బర్త్‌డేకి ఇప్పుడే కొనేస్తారా!" అపనమ్మకంగా చూసింది.

"అదే నా స్టైల్. అందరికీ తెలీదు. నేనేంటో దూరం నుంచి చూస్తే కాదు... దగ్గర నుంచి చూసిన వాళ్ళకే బాగా అర్థమవుతాను!" బిగ్గరగా చెబుతూ లోపలికి తీసుకెళ్ళాడు.

చాలా కుర్చీలు ఖాళీగా ఉన్నా... వారికి ముందెళ్ళిన ఆవిడ పక్కన గౌరిని కూర్చోబెట్టి, ఆ పక్కన తను కూర్చున్నాడు.

గౌరితో ఏదేదో ఉత్సాహంగా మాట్లాడేస్తూ బ్యాంగిల్స్ చూస్తూ కామెంట్లు చేస్తున్నాడు.

గౌరి పక్కనున్న ఆమె– "మీ చీర కలర్, డిజైన్ చాలా బాగున్నాయి!" అంది.

ఆ పొగడ్తకి ఎంతో పొంగిపోయింది గౌరి.


అంతేకాదు ఆమె తన చెవిరింగ్ వంక ఆరాధనగా చూసేసరికి రెక్కలొచ్చినట్టు పొంగి పోయింది.

"మీ ఆయన టేస్ట్ బాగుంది!" అని ఆమె పొగిడే సరికి గాలిలో తేలిపోయింది.

భర్త మీద అమాంతం ప్రేమ ఒలకబోస్తూ, మెచ్చుకుంటూ మాట్లాడింది.

కనుకొలకల్నుంచి పక్కామెనే గమనిస్తూ మెప్పుకోలు కోసం మోర చాచింది.

ఆవిడ కళ్లల్లో అభినందనలు కనిపించేసరికి మరీ దూసుకుపోయింది.




భర్త మీద ప్రేమగా పడుతూ హొయలు ఒలక బోసింది గౌరి.

ఆవిడ వెళ్ళిపోయింది.

"భలేగా నటించావు. దెబ్బకి ఆ సుజాతకి దిమ్మ తిరిగిపోయి వుంటుంది!" గర్వంగా అన్నాడు.

"సుజాత ఎక్కడ?..." చుట్టూ చూస్తూ అడిగింది.

"ఇంతదాకా నీ పక్కన కూర్చుందిగా! గుర్తు పట్టలేదా?"

కంగారు పడింది గౌరి.

"నేను కలిసింది ఈమెను కాదు ఇంకో ఆమెని...!"

"ఇంకెవరు అయ్యుంటారబ్బా!" ఆలోచనలో పడ్డాడు శంకరం.

"మరి మీరెందుకు పలకరించలేదు?"

"నా గురించి కారుకూతలు కూశాక ఏ ముఖం పెట్టుకుని మాట్లాడతాను?"

"పోనీ లెండి...అన్నది ఈవిడ కాదుగా! ఆ ఫ్రెండ్ ఎప్పుడో అప్పుడు మా ఫ్రెండ్ దగ్గర కలవకపోదులెండి. అప్పుడు అన్ని వివరాలూ రాబడతాను. మిమ్మల్ని వూరికే ఆడిపోసుకున్నందుకు చెడామడా దులిపేస్తాను. మీరు ఆ సంగతి మర్చిపోయి ఇలాగే గొప్పగా వుండండి చాలు, మీ మీద ఈగని కూడా వాలనివ్వను. అన్నట్టు ఆమె ఎప్పుడైనా ఇలాగే హఠాత్తుగా ఎదురవ్వొచ్చు. మిమ్మల్నీ మీ ప్రవర్తననీ చూసి కుళ్లిపోవాలంటే ఎప్పటికీ మీరిలాగే ఉండాలి సుమా !"

తల ఆడిస్తూ భార్య వంక సంబరంగా చూశాడు. పొంగిపోయింది గౌరి!

# హస్త పీడ

కోనే నాగ వెంకట ఆంజనేయులు, 9290660220






**ముళ్లపూడి సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో బహుమతి పొందిన కథ**

**నా కొలీగ్ గురునాథం ఒంట్లో బావుండడం లేదని నాలుగు రోజులు ఆఫీస్‌కి సెలవు పెట్టేడు. ఐదో రోజు జాయిన్ కాలేదు సరికదా మరో వారం రోజులు సెలవు కావాలని ఫోన్ చేసి చెప్పేడట మా బాస్‌కి.**

ఆ సాయంత్రం గురునాథం యింటికి వెళ్ళేను ఏం జరిగిందో తెలుసుకుని పరామర్శించ డానికి. ఇంట్లోకి వెళ్లి సోఫాలో కూర్చున్న తరువాత –వాళ్ళావిడ గదిలోకి వెళ్లి నేను వచ్చిన సంగతి చెప్పినట్టుంది– లుంగీ, బనీను, గడ్డం (అన్నీ మాసినవే) లో ఉన్న గురునాథం గదిలోంచి బయటకు వచ్చి నా ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు నీరసంగా.




"ఏమయింది గురూ?" అడిగేను ముఖంలో విచారం ఒలకబోస్తూ.

"కుడి చెయ్యి ఒకటే నొప్పి పెడుతోందిరా చాలా రోజుల నుంచీ! ఈ మధ్యన మరీ ఎక్కువయింది. చెయ్యి ఒకటే గుంజేస్తోంది!" చెప్పేడు ముఖం బాధగా పెట్టి.

"డాక్టర్‌కి చూపించలేక పోయావా?..." అడిగేను.

"అదీ అయ్యింది... ఆయన రాసిచ్చిన మందులు మింగినా, సూదులు గుచ్చుకున్నా నొప్పి తగ్గలేదు. వేరే మందులు మార్చి వాడినా లాభం లేక పోయింది. ఇలా కాదని డాక్టర్‌నే మార్చేశాను. ఆ డాక్టర్ వేరే మందులు, యింజె క్షన్లు యిచ్చినా కూడా నొప్పి రవ్వంతయినా తగ్గలేదు సరి కదా వేళ్ళు రవ్వ లడ్డూల్లా వాచి పోయాయి!" బేర్ మన్నాడు గురునాథం లడ్డూలు చూపిస్తూ.

"ఆ చేత్తో పెద్ద పెద్ద బస్తాలు గానీ, గ్యాస్ సిలిండర్ గానీ ఎత్తేవా?" నొచ్చు కుంటూ అనుమానంగా అడిగేను.

"మనకసలే బద్ధకం ఎక్కువ కదా! అలాంటి పనులేవీ ఎత్తుకోను... మీ చెల్లాయే చూసుకుంటుంది!" చెప్పేడు.

"మరెందుకు తగ్గడం లేదు నొప్పి యిద్దరు డాక్టర్లు చూసినా?" సాలో చనగా అన్నాను.

గురునాథం బేల ముఖం వేశాడు.

చటుకున్న బల్బ్ వెలిగింది నా మెదళ్ళో.

"అవునుగానోరేయ్! నువ్వు ఏ టూత్ పేస్ట్ వాడతావు?" అడిగేను.

"దేనికి? దానికీ నా చెయ్యి నొప్పికీ

ఏమిటి సంబంధం?" అడిగేడు.

"నువ్వు వాడుతున్న టూత్ పేస్ట్ ఏమిటి? తీసుకురా చూస్తాను!" అన్నాను వాడు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా.

బాత్‌రూమ్‌లోకి వెళ్లి వాడు వాడుతున్న టూత్ పేస్ట్ ట్యూబ్ తో సహా బయటికి వచ్చాడు.

ఆ టూత్‌పేస్ట్‌ని చూడగానే విషయం అర్థమై పోయింది నాకు. గురునాథం చెయ్యి నొప్పికి కారణం ఆ పేస్టే అని రూఢీ అయిపోయింది.

"అదీ సంగతి!..." అన్నాను విజయం సాధించిన వాడిలా.

"ఏది?..." అడిగేడు వాడు అయోమయంగా.

"యిదే !... నువ్వు వాడుతున్న టూత్ పేస్ట్!" చెప్పేను.

"ఈ టూత్‌పేస్ట్ వాడితే చెయ్యి నొప్పి పెడుతుందా?" నమ్మలేనట్టు అన్నాడు.

"నీ చెయ్యి నొప్పికి కారణం మాత్రం ఈ టూత్‌పేస్ట్ ట్యూబే అన్నది మాత్రం నిజం!" నొక్కి వక్కాణించాను.

"ఇప్పుడేం చెయ్యమంటావ్ రా?" సలహా కోరేడు.

"వెంటనే ఆ టూత్‌పేస్ట్‌ని... వాడడం ఆపేయ్!"

"మరి పళ్ళు...?" పళ్ళికిలిస్తూ అన్నాడు.

"వేరే టూత్‌పేస్ట్ వాడు!" అని చెప్పి వేరే బ్రాండ్ టూత్‌పేస్ట్ పేరు ఓ కాగితం మీద రాసి యిచ్చాను.


"తగ్గుతుందంటావా?..." అనుమానంగా అన్నాడు.

"వాడి, చూసి, అప్పుడు చెప్పు! మరో విషయం గురూ. ఈ టూత్ పేస్ట్ చాలా పవర్ ఫుల్. పూర్తిగా వాడకూడదు... పేస్ట్ చివర్లో ప్రమాదకరమైన కెమికల్స్ ఉంటాయి. అంచేత పేస్ట్ మూడొంతులు అయిపోగానే ఆ ట్యూబ్ పారేసి కొత్త పేస్ట్ కొనుక్కుని అది వాడాలి. అది కూడా మూడొంతులే వాడాలి సుమా!" జాగ్రత్తలు చెప్పేను లేచి సెలవు తీసుకుంటూ.

మరో వారం రోజుల తరువాత గురునాథం



నవ్వు కొమ్మచ్చి




ఆఫీస్‌కి వచ్చాడు ఆనందంగా.

"నా చెయ్యి నొప్పి–చేత్తో తీసేసినట్టు తగ్గిపోయిందిరా! నువ్వు చెప్పిన ఆ మెడికేటెడ్ టూత్‌పేస్ట్ వాడిన మొదటిరోజు నుంచే చెయ్యి నొప్పి తగ్గు ముఖం పడుతూ... యిప్పుడు పూర్తిగా హుష్ కాకి అయిపోయింది!" చెప్పేడు సంబరంగా కుడి చేత్తో నానా రకాల విన్యాసాలు చేయిస్తూ.

నాకు ధన్యవాదాలు చెప్పి గురునాథం తన సీటు దగ్గరికి వెళ్లిపోయాడు.

"భలే తగ్గించేశావే వాడి చెయ్యి నొప్పి!... అన్నట్టు నీకు వైద్యం తెలుసేమిట్రా?" అడిగేడు నా పక్క సీటు రామారావు గురునాథం వెళ్ళిపోయిన తరువాత.

"వైద్యమా? నా బొందా!!" నవ్వేను.

"మరి? నువ్వు చెప్పిన టూత్‌పేస్ట్ వాడితే చెయ్యి నొప్పి తగ్గిపోయిందని చెప్పేడు కదా గురునాథం!"

"అసలు విషయం ఏమిటంటే –ఆ గురునాథం టూత్‌పేస్ట్ పూర్తిగా అయిపోయిన తరువాత కూడా దాన్ని చేత్తో గట్టిగా నొక్కి నొక్కి ఎంతో కొంత పేస్ట్ బయటికి తీస్తుంటాడు రోజూ. ఆ విషయం– కాగితం అంత పల్చగా అయిపోయిన ఆ టూత్ పేస్ట్ ట్యూబ్‌ని చూడగానే అర్థమైపోయింది. దాన్ని నొక్కి నొక్కి వాడి చెయ్యి నొప్పి పెట్టడం మొదలు పెట్టింది. అదీ సంగతి!" వివరంగా చెప్పేను.

"మరి నువ్వు సిపార్సు చేసిన టూత్‌పేస్ట్ చేతి నొప్పిని ఎలా తగ్గించింది?" సందేహం తీరక అడిగేడు రామారావు.

"కొత్త టూత్‌పేస్ట్ ట్యూబ్‌లోంచి పేస్ట్ బయటికి తీయడానికి చేతిని పెద్దగా శ్రమ పెట్టనవసరం లేదు. యిలా కొంచెం నొక్కగానే పేస్ట్ అలా బయటికి వచ్చేస్తుంది కదా! ఆ పేస్ట్ కూడా మొత్తం అయిపోయిన తరువాత మళ్లీ మళ్లీ నొక్కుతాడేమోనని పేస్ట్ ముప్పావు వంతు అయిపోగానే ప్రమాదకర కెమికల్స్ ఉంటాయని భయపెట్టి మరో కొత్త టూత్‌పేస్ట్ కొనుక్కోమని మరీ మరీ చెప్పేను!" నవ్వాపుకుంటూ చెప్పేను

"అవునూ... యింతకీ వాడి చెయ్యి నొప్పికి కారణం టూత్‌పేస్టేనేమో అనే అనుమానం ఎలా వచ్చింది నీకు అసలు?" సందేహపు ముఖంతో అడిగేడు రామారావు.

"ఎలానా? గతంలో నా కుడి చెయ్యి నొప్పి పెట్టినప్పుడు ఎవరో నాకు కూడా యిదే వైద్యం సిపార్సు చేశారు కాబట్టి!" తేలిగ్గా చెప్పేను.

నోరు తెరిచేశాడు రామారావు. వాడి నోట్లో ఈగలు దూరితే దూరనీ నాకేం... అని నేను నా పనిలో మునిగిపోయాను.

# ప్లీజ్ టేక్ కేర్



గంగాధర్ వడ్లమన్నాటి,9908445969



ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**నెమ్మదిగా డోర్ కర్టెన్ పక్కకు జరిపి– "హలో శేఖర్ గారూ!" అంటూ పిలిచింది లలిత.**

**లోపలి నుండి వచ్చిన శేఖర్ ఆమె వంక అలానే చూస్తూ "చెప్పండి!" అన్నాడు.**

"మేవు మీ ఎదురింట్లోకి కొత్తగా వచ్చాం!" ఆమె మాట పూర్తి కాకముందే...

"తెలుసు!" అనేసి తర్వాత కాస్త తమాయించుకుని... "తెలుసు చెప్పండి!" అన్నాడు చిన్న నవ్వుతో.

"ఏవీ లేదండీ, మీరు కొంచెం ఫ్రీ అయితే, మా తాతయ్యని మీ ఇంట్లో వదిలి వెళ్దావని. నేను ఆన్లైన్‌లో సైకాలజీ క్లాసెస్ చెప్తాను. ఇప్పుడు క్లయింట్ మీటింగ్ ఉంది... అర్జెంట్‌గా బ్రాంచ్‌కి రమ్మన్నారు. తాతయ్య ఒక్కడినే ఇంట్లో వదిలెళ్ళడం ఇష్టంలేక..." క్షణం ఆగి–

"నేను మళ్ళీ సాయంత్రం వచ్చేస్తాను! ఇఫ్ యు డోంట్ మైండ్..." నసిగింది.

"ఇట్స్ ఓకే! వయసులో ఉన్న మనవరాళ్ళున్న తాతయ్యాలంటే చాలా ఇష్టం" అని నాలుక్కరుచుకుని– "అదే అదే... వయసు అయిపోయిన తాతయ్యలంటే నాకూ ఇష్టం. మీరు హైరానా పడకండి .మీ తాతయ్యని నాకు వదిలేయండి!" చెప్పాడు ఆమె వంక తినేసేలా చూస్తూ.

"అయితే మా మూర్తి తాతయ్యకి ఓ లోపం ఉంది!"

"లోపమా!" అని అతని కాళ్ళ వంకా చేతులు వంకా చూసి– "ఏవీ లేదే" అని అతని భుజాలు పట్టుకుని వెనక్కి తిప్పి చూసి– "బానే ఉన్నారుగా!" అడిగాడు డౌటుగా చూస్తూ!


"ఛీ పాడు! శేఖరంగారూ... ఏవిటి మీరు చేస్తున్నది?" అరిచింది లలిత.

"ఓహ్ అయామ్ సారీ!"... అని మళ్ళీ అతన్ని ఇటు వైపుకి తిప్పేసాడు.

"లోపం అంటే మీరనుకున్నది కాదు, మా తాతయ్య నోట్లో నాలుక లేని మనిషి!"

"అయ్యో పాపం! అయితే ఐస్‌క్రీమ్ నాకడం, రుచులు చూడటం చేయలేరన్నమాట!..." అన్నాడు అతని వంక జాలిగా చూస్తూ.

"అది కాదండీ! ఆయనకి మాటలు రావని చెప్పబోయాను. మా నాన్నమ్మ పోయాక చాలా నెలలు డిప్రెషన్ వల్ల ఎవరితోనూ మాట్లాడకుండా ఉండిపోయారు. అలా తరువాత మాట పూర్తిగా పోయింది...




కానీ వినబడుతుంది.”

“అలాగా! మరేం పర్లేదు, మీరెళ్ళి రండి. నేను మీ తాతయ్యని శ్రార్ధం...” అని నాలుక కరుచుకుని, “అదే శ్రద్ధగా చూసుకుంటాను” చెప్పడంతో,

“థాంక్ యు!...” అని చిరునవ్వుతో చెప్పి వెళ్లిపోయింది.

“రండి మూర్తిగారు! లోనికి రండి!” అని తీసుకెళ్లి సోఫాలో కూర్చోబెట్టాడు.

“మా ఆవిడ ఓ ఫంక్షన్‌కి వెళ్లింది. సాయంత్రం వచ్చేస్తుంది !” అంటూ టీవి ఆన్ చేసి బాక్సింగ్ పెట్టాడు.




అది చూస్తూ శేఖరం– “గుద్దు కడుపులో గుద్దు, అదీ వాడి ముక్కు మీద గుద్దు! ” అని బాక్సింగ్‌లో లీనమై పోయాడు.

టీవీ చూస్తున్న మూర్తి గిజ,గిజ లాడిపోతున్నాడు.

“ఏమైంది?...” అని అడుగుతుండగానే, ఫోన్‌లో తన మనవరాలి నెంబర్ నొక్కాడు.

ఆమె శేఖరానికి ఫోన్ చేసి “ఏమైంది?” అని అడిగింది కంగారుగా.

“ఏం లేదండీ... టీవీ లో బాక్సింగ్ పెట్టాను అంతే!” చెప్పాడు.

“అయ్యో! మా తాతయ్యకి బాక్సింగ్ అంటే భయం. కొట్టుకోవడం చూస్తే వణికి పోయి గుండె దడ తెచ్చుకుంటాడు. ప్లీజ్ ఛానెల్ మార్చేయండి! ప్లీజ్!” చెప్పి ఫోన్ పెట్టేసింది.

“సరే!” అని, ఫ్యాషన్ ఛానల్ మార్చాడు.

మళ్ళీ లలిత ఫోన్ చేసి– “ఏమైంది?” అని అడిగింది కంగారుగా.

“ఏం లేదు! ఫ్యాషన్ ఛానల్ పెట్టాను!”

“అయ్యో!... మా నానమ్మ పోయినప్పటి నుండీ అలాంటివి చూడటం లేదు. ఒకవేళ చూసి, ఉద్రేకానికిలోనైతే పెరాలిసీస్ వస్తుంది. ఛానల్ మార్చండీ!” చెప్పి ఫోన్ పెట్టేసింది.

మరి కాసేపటికి భోజనం అయిపోయాక– “తాతగారూ భక్తి సినిమా చూద్దాం!” అని అన్నమయ్య పెట్టాడు. మళ్ళీ తాతయ్య కిందపడి కొట్టుకుంటున్నాడు.

ఈ సారి లలితకి, శేఖరే ఫోన్ చేసి విషయం చెప్పాడు.

“కంగారు లేదు! భక్తి సినిమాలు చూస్తే పూనకం వస్తుంది. మళ్ళీ మామూలైపోతారు. లేచాక, తాగడానికి హార్లిక్సో, మజ్జిగో ఇవ్వండి. నేను వచ్చేస్తున్నాను...” ఫోన్ పెట్టేసిందామె.

“బతికాన్రా దేవుడో!” అని అతను లేచాక, వంట గదిలోకి వెళ్ళి, హార్లిక్స్ కలిపి తెచ్చాడు. నీరసంగా ఉండటంతో, అతనితో గ్లాస్ పట్టుకుని మరీ బలవంతంగా తాగించేసాడు.

హెడ్‌ఫోన్ పెట్టుకుని ఫోన్‌లో సినిమా చూడటం మొదలెట్టాడు.

భార్య మానస వచ్చాక, విషయం చెప్పాడు. అలాగా అని తాతయ్యని చూసి, ఓ పలకరింపు నవ్వు నవ్వి వంటగదిలోకి వెళ్లిపోయింది.

రెండు క్షణాల తర్వాత, వంటగదిలోంచి–

“ఏవండీ! ఈ హార్లిక్స్ సీసా ఎవరు తీశారు. కొంపదీసి కలుపుకు తాగారా ఖర్మ! ఇందులో హార్లిక్స్ అయిపోతే చీమలమందు పోసాను.” అరిచింది.

హెడ్ ఫోన్స్ పెట్టుకోవడంతో శేఖర్‌కి ఏం వినిపించలేదు. కానీ అది వినబడగానే, మూర్తిగారు దేబ్యపు మొహంతో, శేఖరానికి ఎన్నో సైగలు చేశాడు.

శేఖరంకి అర్థం కాక–

“సరే సరే... వచ్చేస్తుంది... ఇంకొంచెం హార్లిక్స్ కలిపి తాగించనా?” అడిగేసరికి...

వద్దు! వద్దు!! అన్నట్టు చేతులు ఊపుతూ భయంతో కళ్ళు పెద్దవి చేస్తూ, ఓ క్షణం మలేరియా వచ్చినట్టు వణికిపోయాడు.

ఇంతలో వంటగదిలోంచి బయటికి వచ్చిన మానస, శేఖరం చెవుల్లో హెడ్‌ఫోన్స్ తీసి–

“ఇది తాగారా మీరు?” అడిగింది.

“లేదు!” చెప్పాడు.

“సరే బ్రతికించారు!...” అని లోనికి వెళ్లిపోయింది.

మూర్తిలో ఇంకా కంగారు పెరిగి పోయింది.

అంతలో అతని మనవరాలు వచ్చి–

“రా తాతయ్యా వెళదాం!” అన్నా సరే వినకుండా...

“డా...డా...” అనడం మొదలు పెట్టాడు.

అది చూసిన లలిత– “ఏమైందండీ? మా తాత ఇలా కంగారుగా ఏదో అంటున్నాడు!”

“ఏం లేదే... ఫ్యాషన్ టీవీ కూడా ఎప్పుడో కట్టేసాను!” చెప్పాడు.

“డాక్టర్! డాక్టర్!!” అనడంతో, లలిత సంతోషంగా– “మా తాతకి మాటలు వచ్చేసాయి!” అంది సంతోషంగా

“డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లమ్మ! ఇతను పాలల్లో హార్లిక్స్ అనుకుని చీమలమందు కలిపి తాగించేసాడు దరిద్రుడు!” చెప్పాడు ఏడుపు మొహంతో మహా కంగారుగా.

“కంగారు పడకు తాతయ్యా! నీకు మాట రావాలని, మేం ముగ్గురం కలిసి ఈ నాటకం ఆడాం!” చెప్పడంతో టెన్షన్ పోయి ప్రశాంతత కన్పించింది తాతగారి ముఖంలో.

# చిదంబరం మావయ్య చిన్ముద్ర

బలభద్రపాత్రుని ఉదయ శంకర్, 9494536524






ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**ఎప్పుడూ అరవకుండా ముంగిలా ఉండే మావయ్య–అరవదేశంలో ఇరవై ఏళ్లు ఉద్యోగం చేసి అరవటం కూడా నేర్చుకున్నాడు. అప్పటి నుంచి ఇంట్లో వాళ్ళు, బయటి వాళ్ళు అనే భేదం లేకుండా చీటికిమాటికి అందరి మీదా అరవటం ఎక్కువైందని ఆండాళ్ అత్తయ్య వాపోతుండేది.**

అలాంటి చిదంబరం మావయ్యకి ఈమధ్య భక్తి బాగా పెరిగిందని, ఎప్పుడూ ధ్యానంలో ఉంటూ ప్రశాంతంగా ఉంటున్నాడని, అరుపులు కేకలు లేవని బంధువర్గం అంతా చెప్పుకుంటున్నారు. ఇదేదో బాగానే ఉందని ఇంట్లో వాళ్ళు కూడా ఆయన జోలికి పోకుండా ఆయన మానాన ఆయన్ని ధ్యానం చేసుకోనిస్తున్నారు.

చిదంబరం మావయ్య నాకు వేలు విడిచిన మేనమామ తోడల్లుడికి పిన్ని కొడుకు. రిటైర్ అయిన తరువాత గుంటూరులోనే స్థిర పడ్డాడని, భక్తి మార్గం పట్టాడని తెలిసి మావయ్యని ఒక ఆదివారం చూడటానికి వెళ్ళాను.



ఇంట్లోకి అడుగు పెట్టగానే – నరసరావుపేట పడక్కుర్చీలో దర్జాగా దర్శనమిచ్చాడు.

నేను విన్నది నిజమే. ఆయన ముఖంలో ఆధ్యాత్మిక కళ ఉట్టి పడుతుంది. కుడి చేతి చూపుడు వేలు, బొటన వేలు కలిపి చిన్ముద్రలో పెట్టి కళ్ళు మూసుకుని కూర్చున్నాడు.

నేను నాలుగు సార్లు పిలిస్తే గానీ కళ్ళు తెరవలేదు. నన్ను చూడగానే పలకరింపుగా నవ్వాడు.

## హాస్య బ్రహ్మలు

ప్రభాకర్ అంతోటి





### ఛాయాదేవి

**1928**లో జన్మించారు **ఛాయాదేవి**, 1942 'దీనబంధు' ఆమె తొలి చిత్రం. గుంటూరు నుంచి వచ్చిన ఛాయాదేవి తొలినాళ్ళలో నృత్యం అభ్యసించారు. మొదట్లో రేణుక ఆఫీసులో చిత్తూరు నాగయ్య ఆఫీసులో వంట చేస్తూ సేవలందించారు.

1953లో వచ్చిన పిచ్చిపుల్లయ్యలో వితంతువుగా, జమిందారిణిగా అద్భుతంగా నటించి గుర్తింపు తెచ్చుకున్నారు ఛాయాదేవి.

నిండైన విగ్రహం, మంచి ముఖ కవళికలు, హాస్యం చిందించే బాడీ లాంగ్వేజ్ ఆమె ప్రత్యేకత. తోటి నటీనటుల పట్ల వాత్సల్యం చూపించే ఛాయాదేవి తెలుగు చిత్రసీమలో ఓ ఆణిముత్యం!

నేను కూడా నవ్వి– "ఏమిటీ? ఈ మధ్య భక్తి ఎక్కువైందిట. ఎప్పుడూ ధ్యానంలోనే ఉంటున్నావట!" అన్నాను.

బదులుగా మళ్ళీ చిరునవ్వు నవ్వాడు.

నేను విన్నది కాకుండా అక్కడ నేను గమనించిన మరో విషయం– మావయ్య ఐదు నిముషాలకు ఒకసారి భుజం పైనున్న ఉత్తరీయం తీసి ముఖంపై కప్పుకుని ప్రాణాయామం చేస్తున్నాడు. అది కూడా చాలా దీర్ఘంగా, లయ బద్ధంగా చేస్తున్నాడు.

నాకు ఎంతో ముచ్చటేసింది. ప్రాణాయామం చేయటానికి ముసుగు ఎందుకు వేసుకుంటున్నాడో అర్థం కాకపోయినా 'పోనీలే... రిటైరైన తర్వాత అయినా ఆధ్యాత్మిక మార్గం పట్టాడు.' అనుకున్నాను.

"నీకు తెలుసో లేదో కానీ మావయ్యా! ఇందులో భక్తి ఒక్కటే కాదు. ఆరోగ్య సూత్రాలు కూడా ఇమిడి ఉన్నాయి. బొటన వేలి చివర ఉండే పిట్యూటరీ గ్రంధి బాగా పనిచేసి హార్మోన్లను సమతూకంగా ఉంచుతుంది. వెన్ను నొప్పి తగ్గుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చూపుడు వేలు చివర ఉండే సైనస్ గ్రంధి సైనస్ సమస్యలు రాకుండా కాపాడుతుంది!" లెక్చర్ ఇచ్చాను.

నిన్ననే ఊరి నుంచి వచ్చిన మావయ్య మేనత్త వర్ధనమ్మ మొలకెత్తిన పెసలు కసాపిసా నములుతూ– "అంతే కాదయ్యా! ప్రాణాయామం వల్ల శ్వాస కూడా నియంత్రణలో ఉంటుందిట, ఆయుష్షు పెరుగుతుందిట!" అని గొప్పగా చెప్పింది.

పనిలో పనిగా పచ్చి కూరలు, మొలకెత్తిన గింజలు గురించి మంతెన రాజు గారి లెవెల్లో చిన్న ఉపన్యాసం కూడా ఇచ్చింది.

మా మాటలు వింటూ చిద్విలాసంగా చూస్తున్నాడు చిదంబరం మావయ్య. ఆండాళ్ళు అత్తయ్య కూడా పొంగిపోయి– "ఇందులో ఇన్ని లాభాలు ఉన్నాయా?... అయితే నేను కూడా చేస్తానండీ! ఈ మధ్య నాకూ వంట్లో కాస్త నలతగా ఉంటుంది!" అంది ఆశగా.

వర్ధనమ్మ గారు గడ్డం కింద చెయ్యి పెట్టుకుని, మావయ్య వంక అనుమానంగా చూస్తూ– "ఇదేంటల్లుడూ చోద్యం కాకపోతే!? దానికి ఈ వయసులో నలతగా ఉండటమేమిటి?" అన్నది కిసుక్కున నవ్వుతూ.

మావయ్య మేనత్తనీ, పెళ్ళాన్నీ ఒకసారి కోపంగా చూసి... మళ్ళీ ధ్యానంలో మునిగిపోయాడు.

అత్తయ్య భయపడి లోపలికి పారిపోయింది కిక్కురుమనకుండా.

వర్ధనమ్మ మాత్రం– "అవునయ్యా చిదంబరం! ఇరవై నాలుగు గంటలూ చిన్ముద్రలో ఉండి, అయిదు నిమిషాలకోసారి ప్రాణాయామం చేయటం ఎందుకు? పొద్దునో, సాయంత్రమో చేస్తే చాలదూ?" అన్నది.

నేను కూడా ఆమెతో ఏకీభవిస్తూ– "మరే! రోజుకు రెండు సార్లు..." అని మావయ్యకు చెప్పబోతుంటే, చిన్న ఉత్పాతం జరిగి ఆ గుట్టు కాస్తా బట్ట బయలైంది.

అత్తయ్య నాకు కాఫీ తీసుకువస్తుంటే, ఆమె కాలు గడపకి కొట్టుకొని తూలి పడబోయింది. ఆ క్రమంలో – ముసుగేసుకొని ప్రాణాయామం చేస్తున్న మావయ్య చేతి మీద వేడి కాఫీ ఒలికి పోయింది. చెయ్యి చుర్రున కాలటంతో మావయ్య ముసుగు విసిరేసి, చెయ్యి విదిలిస్తూ

"అబ్బా! రాక్షసీ!!" అని గట్టిగా అరిచాడు. చిన్ముద్ర విడిపోయి వేళ్ళ మధ్య నుంచి చిటికెడు ముక్కు పొడుం జలజలా రాలటంతో నేను అవాక్కయి, ముక్కు మీద వేలేసుకున్నాను.

మావయ్య బిక్కచచ్చిపోయి దిక్కులు చూస్తుంటే, వర్ధనమ్మ గారు ఆయన బుగ్గల్లో పొడిచి– "మొదటి నుంచీ నాకు అనుమానంగానే ఉంది. ఈ పొడుంకాయ పితలాటకానికేనా...పెద్ద యోగీశ్వరుడు బిల్డప్పూ!" అని దీర్ఘం తీసింది.

చిదంబరం మావయ్య కాస్త తేరుకుని– "నిన్ను వద్దన్నానని నా పరువు తీస్తావుటే చుప్పనాతి శూర్పణఖా!" అని పెళ్లాం మీద గయ్యిమంటుంటే, ఆండాళ్ళు అత్తయ్య పాపం వణికిపోతూ ఆయన చేతిలో పొడుంకాయ పెట్టి, నెత్తిన మళ్ళీ ఉత్తరీయం కప్పి, పిల్లిలా వంటింట్లోకి జారుకుంది.

# హమ్మయ్య! పెళ్ళైపోయింది!

పి.వి.రామశర్మ, 9490244344






**ముళ్ళపూడి సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో బహుమతి పొందిన కథ**

**కొడుకు ఇంద్రజిత్‌కి చాలా సంబంధాలు చూసాడు అహోబలరావు. ఏవేవో కారణాలతో ఏదీ కుదరకడంలేదు అతని జాతకరీత్యా. ఆ సంవత్సరం కుదరకపోతే ఇంకో రెండేళ్ళదాకా పెళ్ళియోగం లేదన్నాడు జాతకరత్న జానకిరాంగారు. పైగా తన తల్లికి కూడా వయసైపోయి తరచూ హాస్పిటల్లో పెట్టాల్సొస్తోంది.**

హాస్పిటల్లో చేర్చిన ప్రతిసారీ అయిన వాళ్ళందరికీ కబుర్లు పెట్టేసి తీరా వాళ్ళంతా వచ్చాక, హాస్పిటల్ బెడ్‌లో టింగురంగా అని లేచి కూర్చుని, వచ్చిన వాళ్ళతో ఇచ్చకాల కబుర్లు చెప్తూ...

నర్సుల్తో– "ఇదిగో అమ్మాయ్!... నన్ను డిశ్చార్జ్ చేసెయ్యమని డాక్టరుగారితో చెప్పు! మావాళ్ళందర్నీ చూసేసా ఇంక ప్రాణం పోయినా ఫర్లేదు. అదేదో ఇంట్లోనే పోనీ!" అనేది.

తీరా ఇంటికొచ్చేక కొడుకుతో– "ఒరే! నా మనవడి పెళ్ళి చూసి గానీ నా ప్రాణం పోదు. చీటికీ మాటికీ ఇలా ఇంటికీ, హాస్పిటల్‌కీ తిరిగే ఓపిక నాకు లేదు. నాకు మీరు చాకిరీ చేయలేక ఏ అనాథాశ్రమంలోనో చేర్పిస్తే, నా చివరి రోజుల్లో ఎవరు నన్ను బాగా చూస్తారో వాళ్ళకే నా ఆస్తి మొత్తం చెందుతుందని వీలు నామా వ్రాసాను కనుక, నా ఆస్తి అనాథాశ్రమానికి పోగలదు జాగ్రత్త! అలా నా వీలు అమలు కాకుండా వుండాలంటే మీరు వీలు చూసుకుని నన్ను చచ్చేదాకా చూడాల్సిందే!" అని ఫిటింగ్ పెట్టిన తల్లి కోసమైనా తప్పదనుకుంటూ... కొడుకు పెళ్ళికి ప్రయత్నాలు ముమ్మరం చేసాడు అహోబలరావు.




అలా ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధంలా యుద్ధ ప్రాతిపదికన తీవ్రప్రయత్నాలు చేసాక, కొన్ని విషయాల్లో కాంప్రమైజ్ చేసుకున్నాక... ఇంద్రజిత్‌కి ఓ సంబంధం కుదిరింది. అవతలవాళ్ళకి కూడా... ఇలానే 'మనవరాలి పెళ్ళి చూసే పోతా!' అని తన కోసం వస్తున్న యమదూతల్ని ప్రతీసారీ తరిమేస్తున్న ఓ పెద్దామె ఉండడంతో అర్జెంట్‌గా ఇరవై రోజుల్లోనే ఓ ముహూర్తం నిశ్చయించేసుకున్నారు.

ఈకాలం పెళ్ళిళ్ళన్నీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ వారి పాలే కావడంతో, వారం రోజుల్లో పెళ్ళన్నా ఎవరూ వెరవడంలేదు.

మనలో మనం కట్నాలు, లాంఛనాలు వంటివన్నీ వదులుకుని మనిద్దరి సొమ్ము కళ్యాణమండపం, కేటరింగ్, సన్నాయి, ఫోటో, వీడియో వగైరాల వాళ్ళకి ధారపోసేద్దాం అని వియ్యాల వారు కూడబలుక్కుని, ఓ ఈవెంట్ మేనేజ్‌మెంట్ వారితో అన్నీ కుదుర్చుకున్నారు. ఆ తర్వాత ఇరువురు ముసలమ్మలకీ చెప్పారు.

"మనవడు, మనవరాలి పెళ్లి కుదిరింది. ఇంక మీరు ప్రశాంతంగా కళ్ళు మూయొచ్చు! సారీ! ఇప్పుడే కాదు వాళ్ళ పెళ్ళయ్యాక!" అని.

వెంటనే పెళ్లి ప్రయత్నాలు ఊపందు కున్నాయి. ఆడవాళ్ళు చందనాది, లలితాది వస్త్ర, నగలలోక విహారం చేసి వచ్చేసారు.

సమయం లేదు కనుక, శాంపిల్‌కి ఓ శుభ లేఖ డిజైన్ చేయించి... దాన్ని వాట్సాప్‌లో పంపడం తప్ప, ఇళ్ళకెళ్ళి పిల్చేదిలేదని ఓ తీర్మానం చేసేసుకున్నారు వియ్యంకులిద్దరూ.

పైగా వియ్యంకులిద్దరూ కూడబలుక్కుని తమ శుభలేఖల్లో– "పెళ్ళికి ఎవరూ మొబైల్స్ తేవద్దు! హాయిగా హాండ్స్‌ఫ్రీగా వచ్చి... మీ బంధుమిత్రులతో కబుర్లు చెప్పుకోండి. మొబైల్స్ లేని రోజుల్లో పెళ్ళిళ్ళలాగా హాయిగా ఎంజాయ్ చేయండి!" అని చివర్లో ఓ అభ్యర్థన హైలైట్‌గా వేయించారు.


అలా వాట్సాప్ శుభలేఖ అందుకున్నవారిలో కొందరు అలిగారు.

'ఇదేంపిలుపు? మా మొబైల్స్ తేవొద్దనడ మేమిటి? అలా అయితే మేమూ వాట్సాప్‌లోనే ఆశీర్వదిస్తాం. పెళ్ళి లైవ్ లింక్ పంపండి!' అన్నారు. వాళ్ళనెలాగోలా ఒప్పించారు.

'పెళ్ళంటే విందు భోజనమే' అన్నట్టుండే వారు... విందు టైం గుర్తు పెట్టు కున్నారు.

✦✦✦

పెళ్లి రెండ్రోజులు వుందనగా అభిజిత్ నాయనమ్మ మళ్లీ హడావిడి చేస్తే హాస్పిటల్‌లో పెట్టారు.





"నీకు దండం పెడతా! నువ్విప్పుడు పోకే అమ్మా! రెండ్రోజుల్లో పెళ్లి. మనవడి పెళ్లి చూసి గానీ పోనన్నావ్‌గా? ఆ మాట మీదుండు!" అని తల్లిని బ్రతిమాలుకున్నాడు, మనసులో ఆమె ఆరోగ్యం పట్ల కలత పడుతూనే.

మొత్తానికి ఇంద్రజిత్ పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది.

వియ్యంకులిద్దరూ తామన్నట్టే– మొబైల్స్ తెచ్చినవాళ్ళవి ఓ డిపాజిట్ కౌంటర్ పెట్టి, అక్కడ వాటిని పెళ్ళయ్యేదాకా భద్రపరిచారు.

బంధుమిత్రులు ఈ విషయంలో గుర్రు మన్నా, తర్వాత ఒకరినొకరు పలకరించు కుంటూ, సరదాగా మాటల్లో పడి, 'పోన్లే! ఇదీ బాగానే వుంది. చాలా ఏళ్ళకి హాయిగా కబుర్లు చెప్పుకోగలిగాం అనుకుంటూ, పరస్పరం ఇళ్ళకి రమ్మని ఆహ్వానించుకున్నారు.




చివరిగా 'మొబైల్ రహిత పెళ్లి' ఆలోచనకి అభినందనలు తెల్పి మరీ వెళ్లారు.

✦✦✦

హాస్పిటల్లో ఉండిపోవడం వల్ల ఇంద్రజిత్ నాయనమ్మ చిరకాల కోరికైన మనవడి పెళ్లి చూడడం జరగలేదు.

పెళ్లికొడుకునీ, పెళ్లికూతుర్నీ పెళ్లి బట్టల తోనే హాస్పిటల్‌కి పిలిపించుకుని ఆశీర్వదిం చింది. ఆ తర్వాత రెండ్రోజులకే తనువు చాలించిందావిడ.

విషయం తెల్సి చాలామంది అహోబల రావుని పరామర్శించారు.

"అయ్యో! ఎంత దురదృష్టం! ఇంకా నయం! రెండ్రోజుల ముందుగానీ పోయుంటే ఆ పెళ్లి కాస్తా ఆగిపోయుండేది!" అనన్నారు.

వారికి సమాధానంగా "పూర్వం ఉత్తరమో, టెలిగ్రాం ద్వారానో మంచి చెడూ తీరిగ్గా తెలి సేవి. ఈ మొబైల్ వచ్చాక సెకన్లలో ఏదైనా అందరికీ చేరిపోతోంది. మా అమ్మ గురించే కాదు, ఇంకే దగ్గరి వారి చెడు వార్తయినా అక్కడ ఎవరో చెప్పేరనుకోండి... మావాడి పెళ్లాగిపోయేది. అందుకే పెళ్లిలో ఎవరూ మొబైల్స్ వాడకుండా ప్లాన్ చేసాం. దురదృష్టం కొద్దీ మా అమ్మకి ఏం జరిగినా పెళ్లయ్యేదాకా చెప్పొద్దని హాస్పిటల్ వాళ్ళకి చెప్పాను... పోన్లెండి! మనవడిని పెళ్ళి బట్టల్లోనైనా చూసి, తన మాట ప్రకారం మా అమ్మ వెళ్లి పోయింది!" అన్నాడు అహోబలరావు తల్లికి మనసులోనే నమస్కరిస్తూ!

# తెలుగు వెలుగు

డా॥ చివుకుల పద్మజ, 9949979660






ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**పాతికేళ్ల క్రితం తెలుగు పంతులుగా రిటైర్ అయిన విశ్వనాథం ఇంట్లో మనవరాలికి పెళ్లిచూపులు. కొడుకు అచ్యుతం ఇంగ్లీష్ టీచర్. ఒక్కగానొక్క కూతురికి అమెరికా సంబంధం చేసి తన తోటి టీచర్స్‌తో గొప్పగా చెప్పాలని పట్టుదల.**

గట్టిగా వాకబు చేసి మంచి స్థితిమంతం గల సంబంధం తెచ్చాడు. కూతురు మాత్రం తెలుగులో పి.జి. చేసి, ఇక్కడే టీచర్‌గా చెయ్యాలని ఆశ పడుతోంది. విశ్వనాథం, భార్యా మనవరాలికి వత్తాసు.



పెళ్ళివారు రానే వచ్చారు. పెళ్ళికొడుకు, తల్లి, తండ్రి, పె.కొ. మేన మామ మహాస్టయిలుగా కారు దిగి వేంచేశారు. పరిచయ కార్యక్రమాలు మొదలయ్యాయి.

విశ్వనాథం గొంతు సవరించుకున్నాడు– "నీ పేరేమిటి అబ్బాయీ?"

"ఆధార్" వినమ్రంగా చెప్పాడు పె.కొ.

"ఆధారా! దేనికి ఆధారం? ఎవరికి ఆధారం?"

బిక్కమొహం వేసాడు పె.కొ.

"వీడు పుట్టిన నాటికి ఆధార్ కార్డులు పెడతారని తెలీక వెరైటీగా ఉందని ఆ పేరు పెట్టేశాం" నంజుతూ చెప్పాడు పె.కొ. తండ్రి.

వారించబోయిన అచ్యుతాన్ని ఒక పక్కకు నెట్టి మరీ తన వాగ్రహం కొనసాగించాడు విశ్వనాథం.

"అయితే ఈ పేరు ఆలోచన మీ తల్లి తండ్రులది అన్నమాట. ఏదీ! 'తల్లి తండ్రులు' ఏ సమాసమో చెప్పండి?"

వెఱ్ఱిమొహాలేశారు పెళ్ళివారు.

"ఏంటీ! మీరు స్కూలు చదువు చదవలేదా?... అది ద్వంద్వ సమాసం."

"అంతే! అదే అయి ఉంటుంది లెండి. సరిగ్గా గుర్తు లేదు" పె.కొ. తండ్రి సర్ది చెప్పబోయాడు.

"అంతే అయి ఉండేది ఏంటి? అది అదే!" హూంకరించి ఈసారి బాణం పక్కకు మళ్ళించాడు.

"మీరెవరు?"

"నేను పె.కొ. మేనమామను!" భయపడుతూ చెప్పాడాయన.

"ఓహో! పె.కొ. నీకు మేనల్లుడా? అయితే 'మేనల్లుడు' సంధి చెప్పు?"


"అదీ!..అదీ!!..."

"ఏమిటా నాన్చుడు? మేన + అల్లుడు ..మేనల్లుడు.. అత్వ సంధి.. అంటే అత్తునకు సంధి వైకల్పికం."

ఆ మేనమామ గుండె జారి అరికాళ్ళలోకి వచ్చినట్లయింది. బాణం మళ్ళీ పె.కొ. కేసి తిరిగింది.

"అమెరికాలో ఎక్కడ ఉంటావబ్బాయీ?"

"పార్లెవిల్ అండీ!" భయభయంగానే బదులిచ్చాడు పె.కొ.




"ఏ సమాసమో చెప్పు?"

"......."

"సర్లే! నేను చెప్తా విను. పార్లే అను పేరు గల విల్.. సంభావనా పూర్వపద కర్మధారయ సమాసం. అన్నట్లు ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నావు కదూ. నీ కంపెనీ గురించి ఉత్ప్రేక్షా లంకారంలో ఒక మాట చెప్పు."

ఈసారి పె.కొ. నీళ్లు నమిలే శబ్దం బాగా వినపడింది.

"ఆపాపు! నీళ్లు నమలకు. పకోడీలు వున్నాయిలే నమిలేందుకు. నా ప్రశ్నకు సమాధానం నేనే చెప్తా విను! ప్రైవేట్ యాజమాన్యం ఉద్యోగులను జలగలవలే పీడిస్తుంది. అదీ ఉత్ప్రేక్షకు ఉదాహరణ."

"మీకిక్కడ పొలాలు అవీ బాగా ఉన్నాయని చెప్పాడు మా అబ్బాయి. ఎలా ఉంటాయేంటి పంటలు?" పె.కొ. తండ్రికి పడింది ప్రశ్న.

"అవునండి! దేవుడి దయ వలన బాగా పండుతాయి, బంగారం అనుకోండి!!" కాస్త ధైర్యంగా చెప్పాడాయన.

"మీరు చెప్పింది ఏ అలంకారం?..."

ఈ మారు ప్రశ్న అడిగింది తాతగారు కాదు, మనవరాలు.

కళ్ళు తిరిగాయి పె.కొ.కి.

"యూ టూ! సీజర్?" అన్నట్లు చూసాడు.

తెల్లమొహంలేసిన అందరినీ ఒకసారి చూసి సమాధానం చెప్పింది పె.కూ.

"బంగారం పండటం అంటే అతిశయోక్తి అలంకారం."

"తెలుగులో పి.జి. చేశావన్నారు కదూ! తెలుస్తోంది!" పె.కూ.ని వెక్కిరించినట్లు అన్నది పె.కొ.తల్లి.

"అవునండీ! మిమ్మల్ని చూసినప్పటినుంచి ఒకటి చెప్పాలనుకుంటున్నాను. ప్రౌఢ వయసులో పార్వతీదేవిలా వున్నారు. ఇందులోని అలంకారం చెప్పండి?"

ఇందాక వెక్కిరించింది కాస్తా ఇప్పుడు గుడ్లు తేలేసింది పె.కొ. తల్లి పొగడ్తో, తెగడ్తో అర్థం కాక.

ఇంకా బాణాలు సిద్ధం చేస్తూనే వున్నారు తాతా మనవరాలు, పెళ్లివారు ఠక్కున లేచి సెలవు తీసుకున్నారు.

వాళ్ళు వెళ్ళగానే అచ్యుతం మండి పడ్డాడు. చక్కని సంబంధం తెస్తే చెడగొట్టారని.


విశ్వనాథం కులాసాగా నవ్వుతూ, చిద్విలాసంగా పడక్కుర్చీలో కూర్చుని, కాళ్ళూపుతూ–

"ఎంతచక్కనిదోయి ఈ తెనుగుతోట" కూని రాగాలు తీశాడు మనవరాలు కోరస్ రాగా.

కానీ పాట పూర్తి కాకముందే పె.కొ వెనక్కు తిరిగి వచ్చాడు ఉత్సాహంగా.

"తాతగారూ!... ఇందాక మీ తెలుగు విని భయపడ్డాను కానీ, ఆలోచిస్తే మంచి బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. మాతరం వారంతా తెలుగు మర్చిపోయి, కూటి కోసం ఇంగ్లీషు వెంటపడ్డాం కానీ ఆ దేశంలో కూడా తెలుగుని నిలబెట్టచ్చు. అమెరికాలో మీ చేత, మీ మనవరాలి చేత తెలుగు క్లాసులు పెట్టిస్తే అద్భుతంగా ఉంటుంది. ఐ లైక్ యువర్ లవ్ టువార్డ్స్ తెలుగు అండ్ ఐ లవ్ యువర్ గ్రాండ్ డాటర్" కొంటెగా పె.కూ. కి కన్నుకొట్టి చెప్పాడు.

"హా!..." అని పె.కూ. పడిపోతే, తెలుగుకి వెలుగు వస్తున్నందుకు విశ్వనాథం, అమెరికా అల్లుడు దొరికినందుకు అచ్యుతం సంబర పడ్డారు.



# మరువకుమా!

యం. రమేష్ కుమార్, 94924 54678





ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**బద్ధకంగా లేచి గోడ గడియారం వైపు చూశాడు విశ్వపతి... ఏడుగంటలు చూపిస్తోంది. విశ్వపతికి ఒక పెద్ద అనుమానం వచ్చింది... అది ఉదయం ఏడుగంటలా? లేక సాయంత్రం ఏడుగంటలా?... తను రాత్రి పడుకుని ఉదయం లేచాడా? లేక అలవాటు ప్రకారం సాయంత్రం పడుకుని ఇప్పుడు లేచాడా? విశ్వపతికి చాలా చిరాగ్గా అనిపించింది.**

ఈమధ్య మతిమరుపు మరీ ఎక్కువైపోతోంది. అయినా ఈ గోడ గడియారాలు తయారుచేసేవాళ్ళు అది ఉదయమో, సాయంత్రమో కూడా తెలియజేసే విధంగా చెయ్యకూడదూ? విసుగ్గా అనుకున్నాడు.

కిటికీ తెరలు తీసి చూసేసరికి వెలుతురును బట్టి అది ఉదయమే అని అర్థమైంది. ఇప్పుడేం చెయ్యాలి? భార్య తనకు అనేక జాగ్రత్తలు చెప్పి... పెద్దకూతురు ఇంటికి వెళ్ళింది. ఆమె చెప్పిన విషయాలు అప్పుడే చాలామట్టుకు మరిచిపోయాడు కూడా! అయినా నాలుగురోజుల పాటు తన తిప్పలేవో తనే పడాలి.

స్నానపానాదులు అయ్యాక ఉప్మా తయారుచెయ్యడం మొదలుపెట్టాడు విశ్వపతి.

అన్నీ వేసినా అది నీళ్ళలాగే ఎందుకుందో... అర్థం కాలేదు. కాసేపయ్యాక అసలు ఉప్మా తయారీకి అవసరమైన నూకని తను వెయ్యనేలేదని గుర్తొచ్చింది.

అప్పటికే టైమ్ ఎనిమిన్నర అయ్యింది.

ఈ రోజుకి టిఫిన్ సంగతి మర్చిపోవాలనుకుని స్టవ్ ఆఫ్ చేశాడు. అప్పుడే సడన్‌గా అతనికో విషయం గుర్తుకొచ్చింది.

తమ ఆఫీస్ టైమింగ్ మార్చారు. పదికి కాకుండా తొమ్మిదికే హాజరవ్వాల్సి వుంది. విశ్వపతి హడావుడిగా తయారై బయల్దేరాడు.

అతనికి మనసులో చాలా టెన్షన్ గా అనిపించింది.

మేనేజర్ చండశాసనుడు! లేటైతే ఎప్పుడూ వినని కొత్త రకాల తిట్లతో తిడుతూ పిచ్చెక్కిస్తాడు. ఆ టార్చర్ భరించడం కష్టం అనుకున్నాడు.

మెయిన్ రోడ్ వరకూ చకచకా నడుచుకుంటూ వచ్చి ఆటో కోసం చూస్తుండగా విశ్వపతికి మళ్ళీ సడన్‌గా ఓ విషయం స్ఫురించింది... తను తలుపులు తాళం పెట్టి వచ్చాడా? లేదా? జేబులో చూసుకున్నాడు.


తాళం చెవులు లేవు! వెంటనే వెనక్కి పరిగెత్తాడు.



# ఈ నెల 'దినం'

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం-జూన్-5






ఇంటికి చేరుకొని చూసేసరికి తాళం వేశాడు గానీ తాళం చెవి ఆ పక్కనే కిటికీ గట్టు మీద పెట్టి మర్చిపోయాడు.

ఆ తాళాలు తీసుకుని మళ్ళీ బయల్దేరాడు.

ఈసారి కూడా పరుగులాంటి నడకతో ఆయాస పడుతూ రోడ్ దగ్గరికి చేరుకొని ఆటో ఎక్కాడు.

ఆఫీస్‌కు చేరుకునేసరికి తొమ్మిది ఇరవై నిముషాలయింది.

గబగబా మేనేజర్ రూమ్‌లోకి వెళ్ళాడు.

అక్కడ కొలీగ్ రాంబాబు కూడా కూర్చొని వున్నాడు.

"రావోయ్ విశ్వపతీ! రా!! కుశలమే కదా?" నవ్వుతూ అన్నాడు మేనేజర్.

ఆలస్యమయినందుకు వెటకారం చేస్తున్నాడని అర్థమైంది విశ్వపతికి.

"సార్! ఏమీ అనుకోకండి... అర్జెంటుగా క్లియర్ చెయ్యాల్సిన ఫైల్స్ ఏమైనా వుంటే ఇచ్చేయండి సార్! ఎలాగైనా ఈరోజు పూర్తి చేసేస్తాను!" కవర్ చేసుకుంటూ అన్నాడు విశ్వపతి.

"ఓహ్! అంతకన్నానా? ఇదుగో ఈ మూడు అర్జెంట్ ఫైల్స్... కొంచెం చూడు!" అంటూ ఇచ్చాడు మేనేజర్.

'హమ్మయ్య!... ఈ రోజు మనకి అక్షింతలు తప్పాయి' అనుకుంటూ సంతోషంగా బైటికి వచ్చాడు విశ్వపతి.

అతడి వెనకాలే రాంబాబు కూడా బైటికి వచ్చాడు.


"మేనేజర్ రూమ్‌లో ఏం చేస్తున్నావు?" రాంబాబుని అడిగాడు విశ్వపతి.

"ఏం చెయ్యడమేమిటి నా బొంద! రెండు నిమిషాలు లేటుగా వచ్చినందుకు ఇరవై నిమిషాల పాటు చిత్ర విచిత్రమైన తిట్లు తిట్టాడు మన శాడిస్టు మేనేజర్!" మండిపడుతూ అన్నాడు రాంబాబు.

"అరె! మరి నేనూ ఇరవై నిమిషాలు లేటుగా వచ్చాను. నన్ను ఒక్కమాట కూడా అనలేదేమిటి?"

"నీ బొంద! నీకు అంతకంతకీ మతిమరుపు తారాస్థాయికి చేరుతున్నట్టుంది. నువ్వు రిటైరై నాల్రోజులయింది... నువ్వేదో ఇంటిదగ్గర ఖాళీగా కూర్చోలేక స్వచ్ఛందంగా పనిచేయడానికొచ్చావని సంతోషించి నీ చేత ఫ్రీగా పని చేయించుకోవచ్చని సంబరపడుతున్నాడు మన మేనేజర్. సరే... అయిందేదో అయింది... నీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ వచ్చేవరకూ అప్పుడప్పుడూ ఇలా వచ్చి పనిచేయి. ఒక్కరోజే వచ్చి మానేస్తే మళ్ళీ ఈ విషయానికి కూడా నీ మీద కక్ష గట్టి ఆ బెనిఫిట్స్ అప్రూవ్ చెయ్యకుండా సాధించగలడు మనోడు!" చల్లగా చెప్పాడు రాంబాబు.

"అయ్యో నా మతిమరుపు మండిపోనూ! అనవసరంగా ఇరుక్కున్నా(నా దేవుడా!" అనుకుంటూ ఏడుపు మొహంతో చేతిలో వున్న ఫైళ్ల వంక చూస్తూండిపోయాడు మతిమరుపు విశ్వపతి!



# ఇదిగో తోక...

ఎమ్.ఎ. పద్మనాభరావు, 9848607127






ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**"జిగురుమూర్తిగారు! ఆగండి! ఎంటా పరుగు? పనిమీద వెళ్తున్నారా?" పీకేరావు జిగురుమూర్తి కడ్డం పడ్డాడు.**

**"నాయనా పీకేరావు! జి తర్వాత చుక్క. నా పేరును అలా అతికించి అవస్థ పెట్ట కయ్యా! అయినా దారికడ్డం పడి పనిమీదెళ్తున్నారా?.. పళ్ళికిలించుకుంటూ వెళ్తు న్నారా? ఏమిటా తింగర ప్రశ్నలు?!" ఊపిరి పీల్చుకుని...**

"అవును! పనిమీదే వెళ్తున్నాను... ఇవ్వాళ జనవరి పదో తారీకు... ఇప్పటివరకు నా ఫించను జమవ్వలేదు... కనుక్కుందామని బ్యాంకు కెళ్తున్నాను. నీకేం బాబు? పొద్దున్నే గంట పది కొట్టగానే ఆఫీసు కొచ్చినట్టు ఈ చెరువు గట్టుపై వాలిపోతావు. ఈ దారిని పోయే ప్రతీ ఒక్కడి ఆనుపానులు లౌక్యంగా తెలుసుకుంటావు. అలా రాబట్టిన వన్నీ నీకు తగ్గట్టుగా వండి వార్చి ఊళ్ళో వాళ్ళకి పడే స్తావు. అవి పొయ్యిలో పడ్డ పేలాల్లా ఊరంతా మారుమోగి పేలి చస్తాయి."



రిటైర్డ్ తాసిల్దార్ గొల్ల గురు మూర్తి గొల్లు మన్నాడు.

ఆంధ్రరాష్ట్రంలో అదో చిన్న పట్నం లాంటి ఊరు. ఆ ఊర్లో నడిబొడ్డున నాలుగు వీధుల సెంటర్. అక్కడో చెరువు. ఆ చెరువుగట్టున ఓ రావిచెట్టు దాని చుట్టూ ఒక సిమెంట్ గట్టు. రావాకుల గలగలతో పాటు చెట్టుపై వాలే కాకుల గోల కూడా ఎక్కువే. ఊళ్లో వాళ్ళు ఎక్కడికి వెళ్లాలన్నా ఆ చెరువుగట్టు మీంచే వెళ్లాలి. తండ్రిచ్చిన నాలుగెకరాలపై వచ్చే ఆదాయాన్ని అనుభ విస్తూ ఉదయమే అల్పాహారాన్ని ముగించుకుని ఇక్కడికి చేరుకుంటాడు పీకేరావనబడే పీచు కేశవరావు. వీడో బండకాకి ఏదైనా విషయం తన దృష్టిలో కొచ్చిందంటే చాలు అవతలి వాడు వినిపించుకునే వరకు అరచి గీ పెడుతూనే ఉంటాడు. పొద్దుపోయే కొద్దీ కొన్ని పిల్లకాకులు కూడా చేరుతాయి.

ఆ కాకులకి కావలసినవి ఆఖర్లేనివి ఉండవు. ఊళ్ళో వార్తలు సేకరించి వాటిని పుకార్ల రూపంలోకి వండి వార్చేస్తూ ఉంటాయి.

పొద్దుపోయి చాలాసేపయ్యింది. వంటకానికి వార్తలేమి లేక పీకేరావుకు తోచడంలేదు. ఆ సమయంలో వచ్చాడు గాబరా...! వీడో పిల్లకాకి. వీడసలు పేరు గాలి బాలరాజైనా, వీడ్ని అందరూ గాబరా అంటారు. వీడికో విషయం తెలిస్తే చాలు... "పీకేయన్నా...పీకేయన్నా...!" అంటూ కడుపుబ్బరంతో మెలికలు తిరుగుతూ కాకిలా అరుస్తూ చెరువుగట్టు కొచ్చేస్తాడు.

## ఏడు వారాల నవ్వులు




వాడికి తెల్సింది పీకేవోడి చెవిలో ఊదేస్తాడు.

"నువ్వేం చెప్పకుండా ఏం పీకనురా? మరీ గాబరా పడకుండా విషయమేమిటో చెప్పరా! పొద్దున్నించే వండడానికి వార్తల్లేక పిచ్చెక్కి పోతోంది."

"మరీ...మరీ మన చినరాయుడు లేడూ...? ఆడి సిన్న కూతురు కాలు జారిందిట!" వార్త చెప్పేసి కాకిలా తల తిప్పుతూ... ఆ గట్టుపై నడుం వాల్చాడు చిన్న కునుకేద్దామని.

"మంచి కాకి కబురట్టు కొచ్చేడు వీడు. దీన్ని ఇంకొకడి చెవిలో పడేయ్యాలి! లేకపోతే నా కడుపుబ్బి పోతుంది..." అనుకుంటూంటే జిగురుమూర్తి దిగాలుగా వస్తూ కనిపించాడు.

"జిగురుమూర్తి గారు! ఇలా రండి. వేడివేడి గరంగరం కబురు విందురు గాని."

"జి తర్వాత చుక్క!" తెగ బాధ పడిపోయాడు జిగురుమూర్తి.

"సర్లేవయ్యా! నీ చుక్కా నువ్వూను... ఇది విను ఆ తర్వాత చుక్కలు కనిపిస్తాయి." గాలి వార్త చెప్పేసాడు పీకే.

"ఇదంతా ఎప్పుడు జరిగింది?" ఆలోచిస్తూ అడిగాడు జిగురుమూర్తి అదే జి.గురుమూర్తి.

"ఓ మూడ్నేలలు క్రితం జరిగిందిట!" ఎప్పుడైతే నీకేంటన్నట్టు చూసాడు పీకేవోడు.


"మూడు నెలల క్రితమా? అప్పుడు నే బ్రతికి లేనుగా? నాకెందుకు చెప్తున్నావు?"

"బ్రతికి లేవా? అంటే ..." అయోమయంగా అడిగాడు. ఇదో రకం పుకారా ఏంటి?... అను కున్నాడు పీకేవోడు.

"నా ఫించను ఎందుకు జమవ్వలేదని... బ్యాంకులో అడిగాను. వాళ్ళు చాలాసేపు కంప్యూటర్ శోధించి, రికార్డులు పరిశోధించి చివరికేం తెల్చారంటే మొన్న నవంబర్లో నే బ్రతికున్నట్టు లైఫ్ సర్టిఫికేట్ ఇవ్వలేదుట. అందుకని నా ఫించన్ జమ చేయ్యలేదన్నారు. మరి నా ఫించన్ రావాలంటే... పోయినేడు కూడా నే బ్రతికున్నట్టు డాక్టర్ సర్టిఫికేట్ ఇస్తే ఫించన్ ఇస్తారుట... బ్యాంకు వాళ్ళ లెక్కల్లో నే బ్రతికి లేనట్టే కదా? కాబట్టి మూడు నెలల క్రితం నే బ్రతికిలేను కనుక... ఎవరు కాలు జారితే నాకేంటి?... ఎవరి నడుం విరిగితే నాకేంటి?... నీకింకో విషయం తెల్సా?... కాలుజారింది నాయుడు కూతురు కాదు... నాయుడే! అది నువ్వనుకున్న కాలు జారడం కాదు!... బాత్‌రూంలో జారాడు. కాలు విరి గింది. ఇప్పుడే హాస్పిటల్లో చూసొచ్చా. ఇదిగో తోక అంటే అదిగో పులి అనే ఈ గాలిగాడు ఉత్తి గాలి కబుర్లు తప్ప నిజాలెప్పుడు చెప్పి చచ్చాడు." వైరాగ్యంగా రావిచెట్టు పైకి చూస్తూ అన్నాడు జిగురుమూర్తి.

పైన ఓ కాకి కావుమంది. కింద పీకేవోడు కెవ్వుమన్నాడు. గాబరాకు నిద్రా భంగమైంది.

పుకారు కాకెత్తుకు పోయింది.



# నవ్వుతూ బతకాలిరా!

శ్రీమతి వరలక్ష్మి గున్నయాచారి, 9866069417





ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**కోటేశ్వర్రావ్... ఒక ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మనిషి మహా పిసినారి. ఆఫీసులో తన తోటి ఉద్యోగులు, కోటేశ్వర్రావ్ మీద అనేక రకాలుగా సరదాగా జోక్స్ వేసుకుంటూ నవ్వుకుంటుంటారు.**


**అతగాడు దేనికీ చలించే రకం కాదు.**

“ఈ రోజు మీ పుట్టినరోజండీ...!” అంటూ కోటేశ్వర్రావ్ భార్య అర్చన, వారి ఎనిమిదేళ్ళ కూతురు కృతి అతడికి శుభాకాంక్షలు తెలిపారు సంతోషంగా నవ్వుతూ.

“మన ఇంటికి దగ్గరలో వున్న స్వీట్ షాపుకెళ్లి, స్వీటు, హాటు తీసుకురాకూడదా?”

“ఇప్పుడెందుకే స్వీటూ, హాటూనూ! ఎలాగూ ఉదయం సేమ్యాపాయసం చేసావ్ కదే!... ఆ అన్నట్టు ముందా పాయసం ఆరగించనీ.” అంటూనే ఆవిడ చేతిలోని పాయసం గ్లాసును తీసుకోగానే ముఖం చిట్లించాడు.

“ఏమిటిది? నాకిచ్చే ఒక గ్లాసు పాయసంలోనే అంత మందంగా ఉన్న జీడిపప్పు పలుకులు వేసావ్ కదటే! ఆ పప్పుని రెండు ముక్కలుగా విడగొట్టి వేస్తారు కదే పిచ్చిమొద్దూ! ఓరి బాబోయ్...ఇన్నేసి కిస్‌మిస్‌లా! ఇక, యాలకుల పొడి బాగా దంచికొట్టి ఘుమఘుమలాడటం కోసం వేసేసావ్ సుమీ!



చిక్కటి పాలతో, ఇంత ముద్ద లాంటి....” పళ్ళు బిగబట్టి పెళ్లాం వైపు కోపంగాచూస్తూ–

“అసలిది... గొంతు దిగాలా? లేకపోతే వాంతి గానీ చేసేసుకోవాలా? మళ్లీ ఇలా చేయకు!!” అంటూ... కాస్త సీరియస్‌గా చెబుతూ వార్నింగిచ్చాడు.

మొత్తానికి ఎలాగో అయిందనిపించాడు.

అర్చన తన మనసును దిటవు చేసుకుని... కాసేపటికి మరల అంది.

స్వీట్, హాట్ గురించి గుర్తు చేస్తూ.

“మీ పుట్టినరోజని ఎవరయినా మన ఇంటికి వస్తారేమోనని...” సంశయంగా అంది.

“పాయసం ఎలానూ ఉంది కదా!... ఎప్పుడూ చేసే మూరీ మిక్చ్సర్ చేసెయ్! బయట బీచ్ దగ్గర మూరీమిక్చ్సర్ అమ్మేవాళ్ళ మాదిరిగా పొట్లాలు కట్టి సర్‌ప్రైజ్ చెయ్! ఆఁ!...ఎలానూ మన పెరట్లో వున్న పండిన బొప్పాయిలు, జామ చెట్టుకున్న జామపళ్ళు నిన్ననే కోశావ్ కదా! అవి చక్కగా ముక్కలు కోసి పెట్టు!” అదేదో గొప్పగా చెప్పాననుకుని పొంగిపోయాడు.

“అస్తమానూ అలా పెడుతూంటే సిగ్గుగా ఉంటోందండీ. అప్పుడప్పుడు వచ్చే నా స్నేహితురాలు కూడా ఓ నాలుగయిదుసార్లన్నా అననే అందిలా–

"నేనేమన్నా అడవిలో వుండే మునిపత్నినను కున్నావా? లేదా అనారోగ్య మనిషినను కున్నావా? జామపళ్ళముక్కలు, బొప్పాయి... ఇంకా కాకపోతే మూరీమిక్చర్ ఉండనే ఉంది కదా! దానినో ఆయుధంగా చేసేసుకున్నారు సుమా! మేమెప్పుడయినా బీచ్‌కు గానీ... పార్కుకు గానీ వెళ్ళినప్పుడు నాకు మీ ఇంటి వాతావరణమే గుర్తుకు వచ్చి మూరీమిక్చర్ అసలు తినాలనిపించదు. అంతలా వెగటు పుట్టించావ్!" నన్ను దెబ్బలాడి కసురుకుంది.

"ఆఁ! ఫర్వాలేదులే!" అనంటూ బయటికెళ్లి పోయాడు.

ఓ అరగంటలో ఇరవై రూపాయలు పెట్టి బెల్లం జిలేబీ కొని తీసుకువచ్చి, టేబిల్‌మీద గిరాటేసాడు.

✦✦✦

ఆఫీసులో అడుగు పెట్టగానే తోటి సహోద్యోగులు అతడిని చుట్టుముట్టారు.

'హ్యాబర్త్‌డే' అంటూ అందరూ విష్ చేసి సంతోషంగా అన్నారంతా ఇలా...


"ఈ రోజెలాగయినా పార్టీ ఇవ్వాలోయ్ కోటీశ్వర్రావ్!" అని చెబుతూనే పట్టుబట్టి... లంచ్ అవర్లో ఓ హోటల్‌కి తీసుకుపోయారు.

కోటేశ్వర్రావ్‌కి నోట మాట పెగలక బిర్ర బిగుసుకుపోయాడు.

"ఏమోయ్! కోటేశ్వర్రావ్ అన్న పేరు పెట్టుకున్నందుకు నిజంగానే కోట్లు గానీ కూడబెడతావా ఏమిటి?... ఎప్పుడు పార్టీ అడిగినా మొహం గంటు పెట్టుకునే ఉంటావ్‌సుమీ!" అనంటూనే– "అలవైకుంఠపురం సినిమా లోలాగా నటుడు మురళీశర్మలా మొహం అదో రకంగా పెడతావ్!" అతడితో కాస్త చనువుగా ఉన్న ఓ ఇద్దరు ముగ్గురు కవ్వించారు.

మనవాడి నోట్లో పచ్చివెలక్కాయ పడ్డట్టుగా మిడిమిడిచూపులు చూస్తుండగా అందులో ఒకతను కోటేశ్వర్రావ్ ఏటిఎమ్ కార్డు అడిగి అది తీసుకుని బయటకు వెళ్లి ఓ ఇరవై నిమిషాల్లో వచ్చి కూర్చున్నాడు స్వీట్ పాకెట్‌తో.

అందరూ రక రకాల ఐటెమ్స్‌ని తెప్పించుకుని సరదాగా సంతోషంగా తింటుంటే... కోటేశ్వర్రావ్ మాత్రం ఏదో విషపదార్థం తింటున్నట్టుగా తెగ ఫీలయిపోసాగాడు.




అతడి మైండ్ దిమ్మతిరిగినట్టయింది. ఎంత డబ్బు ఖర్చయిపోయిందోననుకుంటూ.

కాసేపటికి ఎవరికి వారెళ్లిపోయారు.

తర్వాత ఇంటికెళ్ళిన కోటేశ్వర్రావ్ ఓ పక్క విపరీతంగా టెన్షన్ పడుతూనే ఆ మరుసటి రోజు ఉదయం లేచి, తన ఏటిఎం కార్డును ఆత్రంగా చూసుకోగానే... అతని ఆశ్చర్యం అంతా ఇంతా కాదు.

ఇదేమిటి? డబ్బులు అస్సలు డ్రా చేయనే లేదు. కనీసం ఓ పదివేలకు మించి తీసినా, తన ఫోన్ నెంబరుకు కాల్ రాలేదు, ఓటిపి నెంబరు తనను అడగలేదు. ఏమిటో... అనుకుంటూ ఆఫీసుకెళ్ళాడు కోటేశ్వర్రావ్.

స్టాఫంతా ఎవరి పనుల్లో వారున్నారు.

అక్కడ ఒకింత నిశ్శబ్దం ఆవరించడంతో... ఉండబట్టలేని కోటేశ్వర్రావ్ అతడి కంఠంలో ఎనలేని బాధ ధ్వనిస్తుండగా అన్నాడు.

"మీ అందరకూ సారీ... వెరీ వెరీ సారీ... డబ్బులు..." అంటూ చివరగా నీళ్ళు నమిలాడు. అతడు పడుతున్న బాధలోని పశ్చాత్తాపం వారంతా గ్రహించారు.

అప్పుడు మాట్లాడసాగారు.

"కోటేశ్వర్రావ్! డబ్బెప్పుడూ శాశ్వతం కాదు. ఎందుకంటే జీవితానికి, జీతానికి లంకె కట్టి పెట్టి లెక్కలు కడతావ్... భగవంతుడిచ్చిన మన ఆయుష్షులో ఈ పుట్టినరోజు పేరిట తన వయసు, సంఖ్య తగ్గిపోతూ తరిగిపోతూంది కదా! అలాగే పైబడుతూన్న వయసురీత్యా కూడా మన పెద్దరకానికి మరింత బాధ్యత పెరిగిందని తెలుసుకోవాలి... అంతకు రెట్టింపుగా అంటే మన బరువు బాధ్యతలను నిస్వార్థంగా జీవితంలో బతికే బతుకును ఇకపై నవ్వుతూ ఎదుర్కోవాలి!... చెప్పాలంటే మా అభిమతం నిన్ను బాధపెట్టాలని కాదు. ఏదో సరదా! అన్నట్టు మనముండేలా చూడాలి. అప్పుడే మనకు సంతృప్తి... మనందరి సంతోషం కోసమే సుమా! సరదాగా ఎంజాయ్ చేస్తూంటాం!" అన్నారు.

"ఇకనుంచీ నేను కూడా మీ పార్టీలోని వాడినే!" అంటూ పకపకా నవ్వేసి...

'ఇదిగో అడ్వాన్స్‌గా ఏటిఎం కార్డు!...' అంటూ ఇవ్వబోయాడు.

"అంత మాటన్నావ్ అదే చాలు మాకు! సంతోషం...అలా నవ్వుతూ బతకాలి!"

అందరి ముఖాల్లో వెలుగులు.

నవ్వులతో ముంచెత్తారు.

వారందరికీ మరోసారి క్షమాపణలు చెబుతూ తను కూడా నవ్వులతో పాలుపంచుకున్నాడు పాపం కోటేశ్వర్రావ్.

# ఆనందో అమ్మ!

మన్నవ సిస్టర్స్, 6305204796





ముళ్లపూడి
సింగిల్‌పేజీ హాస్యకథల పోటీలో
బహుమతి పొందిన కథ

**"ఏంటమ్మా,! చదువుకుంటూ... నవ్వుకుంటున్నావు?"అని అడిగాడు తల్లిని సుధాకర్ ఆఫీసుకు వెళుతూ!**

**ఆమె సమాధానం చెప్పలేదు. పరధ్యానంలో వుందేమో నా మాట వినపడలేదేమో అని తనకు తాను సర్దిచెప్పుకుని ముందుకు కదిలాడు సుధాకర్!**

ఆఫీసులో కూడా సుధాకర్ అమ్మ విషయం గురించే ఆలోచిస్తున్నాడు. ఈ మధ్య అమ్మలో చాలా తేడా గమనిస్తున్నాడు,

ముఖంలో ఏదో వెలుగు కనిపిస్తోంది...

ఎప్పుడు చూసినా ఆ పుస్తకాలు...

ఈ పుస్తకాలు అని ఏవేవో తెప్పించుకుని మరీ చదువుకుంటోంది, ఎక్కువగా ఇతిహాసాల మీద కూడా దృష్టి పెట్టడం సుధాకర్ గమనించాడు. అంతకు ముందు బద్ధకంగానూ, ఏదో కోల్పోయిన దానిలా కనిపించేది...

కొంత కాలం క్రితం తీవ్రమైన అస్వస్థతకు గురయింది, చాలా కష్టపడాల్సి వచ్చింది. ఏదేవుడు కరుణించాడో, వైద్యం చేసిన డాక్టర్ హస్తవాసో తెలియదు కాని, మొత్తానికి గండం నుంచి బయట పడింది.

తల్లి కోసం, తన రూంలో టీవీ పెట్టించాడు.


సెల్ కొనిచ్చాడు. వాటితో సమయం గడుపుతూ వుండేది. ఈ మధ్య టీవీ చూడటం తగ్గించింది... సెల్ కూడా చూడటం తగ్గించింది... కేవలం చదవటానికి ఇష్టపడుతోంది! ఎక్కడ్నుండో వచ్చాయో తెలియదు, పురాణాలు, ఇతిహాసాలు లాంటి పుస్తకాలు ఇంట్లో కనపడుతున్నాయి. వాటికి చాలా సమయం వెచ్చిస్తోంది.

మనుష్యులతో చాలా కొద్దిగా మాట్లాడుతోంది.

ఎన్నడూ లేనిది ప్రతినెలా ఒక బుక్‌పోస్టు వస్తోంది. మిగిలిన పుస్తకాలు ఒక ఎత్తు అయితే, ఈ పుస్తకం మరో ఎత్తు అన్నట్టు ఆమె వ్యవహరిస్తోంది.

ఆ బుక్‌ని మాత్రం ప్రతిరోజూ మూడు సార్లు చదువుతోంది. దీర్ఘంగా పరిశీలిస్తుంది, తనలో తాను నవ్వుకుంటుంది. ఒక్కోసారి పైకి నవ్వుతోంది. తాను గమనిస్తూనే వున్నాడు. ఒక రోజు ఉండబట్టలేక అడిగేశాడు.

'ఏంటమ్మా! ఆ బుక్? ప్రతినెలా బుక్ పోస్టు వస్తోంది! అది కూడా నీ పేరుతోనే వస్తోంది!" అని.



"నాకేం తెలుసు నాయనా! ఎవరు పంపుతున్నారో తెలియదు, ప్రతినెలా వస్తోంది... నేను ఆ బుక్‌కి డబ్బులు కూడా కట్టలేదు!" అని అంటూ, ఇవన్నీ అలా వచ్చినవే అని పురాణాలు, ఇతిహాసాల పుస్తకాల వైపు చూపెట్టింది.

సుధాకర్ ఆ బుక్‌ని తీసుకుని చూశాడు.

బుక్ కవర్ మీద అడ్రసు చూశాడు. బుక్ ఫ్రమ్ అడ్రసులో వున్న ఫోన్ నెంబరుకు ఫోన్ చేసి, వారి ఆఫీసుకు వెళ్ళాడు.

ఆ ఆఫీసు వాళ్ళు ఎంతో మర్యాద చేశారు.

సుధాకర్ బుక్ తాలూకు వివరాలు... ఎవరు డబ్బులు కట్టింది అడిగి తెలుసుకున్నాడు.

"ఎవరో అమ్మ పేరు మీద జీవిత చందా కట్టారు!" అని వాళ్ళు చెప్పిన మాటలు బట్టి అర్థమయింది.

'ఎవరు ?' అని ఆలోచిస్తూ, కట్టిన వాళ్ళ అడ్రసు రిక్వెస్టు చేసి మరీ తీసుకున్నాడు.

వాళ్ళిచ్చిన పేరు, అడ్రస్సు ఎక్కడో విన్నట్టు చూసినట్టు వుంది. గుర్తుకు రావట్లేదు, తన తల్లి కొంత కాలం క్రితం హాస్పటల్‌లో వున్నపుడు ఈ అడ్రస్సుకు తిరిగినట్లు గుర్తు... ఎక్కడో ఏదో తెలియని బాధ, ఎక్కడో ఏదో గుర్తుకు తెచ్చేలా చేస్తోంది...

వెంటనే ఆ అడ్రస్సు వెతుక్కుంటూ వెళ్ళాడు.

ఆ అడ్రస్సులోని వీధిలోకి అడుగుపెట్టగానే అర్థమైంది.


ఆ అడ్రస్సు తన స్నేహితుడిదే! పేరు ఆనంద్!

నేరుగా వెళ్ళి తలుపు తట్టాను! అతనే తలుపు తీశాడు. చూడగానే ఎంతో సంతోష పడ్డాడు. చాలా సంవత్సరాలు అయిందనేమో, సుధాకర్‌ని కౌగిలించుకున్నాడు కూడా!

కాని సుధాకర్‌లో న్యూనతా భావం, 'అవును మరి ఎందుకుండదు? తల్లి వైద్యం నిమిత్తం అతని దగ్గర పెద్ద మొత్తం డబ్బులు చేబదులు తీసుకుని– అతను కష్టంలో వున్నపుడు, ఎన్నిసార్లు అడిగినా, లేదని, ఇపుడు కాదని, కాగితం ఏమైనా వుందా అని దారుణంగా ఎగతాళి చేశాడు తను! అవన్నీ గుర్తుకు తెచ్చుకుని ఒక్కసారిగా ఏడుపు తన్నుకు వచ్చింది. తను తప్పు చేసినా, మోసం చేసినా, తన తల్లి బాగుండాలని, తన డబ్బులు ఖర్చు చేసి, అన్నేసి పుస్తకాలు పంపి, ఆవిడ పేరుతో మంచి ఆనందం కలిగే పుస్తకాలకు జీవిత చందా కట్టి,

## తీన్మార్

- శేఖర్




తన తల్లిని పరోక్షంగా ఆరోగ్యంగా చేస్తున్నాడంటే... అతని మనసు ఎంత గొప్పది! కళ్ళ వెంబడి వస్తున్న నీళ్ళు తుడుచుకుని... ఆనంద్‌ని మనస్ఫూర్తిగా కౌగిలించుకున్నాడు సుధాకర్.

ఆనంద్ చేతిలో వున్న హాస్యానందం దీవిస్తున్నట్టు కిలకిలమని నవ్వుతోంది...

అమ్మ దగ్గర చూసింది కూడా ఆ పుస్తకమే.


విడ్డూరం!!
- BOMMAN
సినిమా రివ్యూ రైటర్ను
దర్శకులు, నిర్మాతలు, హీరోలు.
10 వ తరగతి
గురువులను పూజింపుము
మనుష్యులపై కుక్కల దాడులు
బొమ్మన్

# "అదే స్వాతి బలరామ్‌గారి విజయ రహస్యం!"

-ప్రభాకర్ జైనీ

**తెలుగు పత్రికల్లో ఓ ప్రభంజనం... తెలుగు పత్రికల స్థాయిని పెంచిన పత్రిక స్వాతి. అయితే దాని రథసారథి శ్రీ వేమూరి బలరామ్‌గారి కష్టానికి, కమిట్‌మెంట్‌కి ప్రతిఫలం స్వాతి సక్సెస్! ఎందరో ప్రచురణ కర్తలకు, ఎడిటర్లకు మార్గదర్శకులైన శ్రీ వేమూరి బలరామ్‌గారి గురించి బయోపిక్ తీయటమంటే ఆషామాషీ విషయం కాదు. ఆయన జీవితంలో ఎన్ని మలుపులు, ఎన్ని ఒడిదుడుకులు, ఎన్నిప్రతిబంధకాలు... ఇలా అన్నింటిని సమన్వయం చేసి తెరమీద ఆవిష్కరించటం చాలా కష్టతరమైన పనే! ఆ పనిని ధైర్యంగా భుజాన వేసుకుని 'స్వాతి బలరామ్' బయోపిక్‌ని ' అతడే ఒక సైన్యం' పేరుతో తెరకెక్కిస్తున్న దర్శక, రచయిత శ్రీ ప్రభాకర్ జైనీ గారి ఆలోచనని మెచ్చుకుంటూ, ఆయన మనోభావాలను తెలుసుకునేందుకు ఒక చిన్న ప్రయత్నం!**

✦ **స్వాతి బలరామ్ గారిపైనే మీరు సినిమా చేయాలనుకోవడానికి గల ప్రధాన కారణం?**

నేను బలరాం గారిని ఫిబ్రవరి 15న కలవడం జరిగింది. ఆ రోజు ఉదయం అయిదు గంటల వరకూ నా నవలని కరక్షన్ చేసి, ఫైనల్ కాపీ ప్రింట్ తీసి, దానిని ఇవ్వడానికి గాను వెళ్ళడం జరిగింది. అప్పుడు స్వాతి బలరామ్ గారిని కలవడం జరిగింది. అప్పుడే నేను, వారు చెప్పిన విషయాలకి ముగ్ధుడినైపోయాను. 'ఒకప్పుడు సైకిల్ మీద తిరిగే వాడిని... ఇపుడు రోల్స్ రాయిస్ మీద తిరుగుతున్నా!' అన్నారు. అప్పుడే నాలో దర్శకుడు ఆయనతో ఓ సినిమా తీయాలని అనుకున్నాడు. ఇది వరకు కాళోజీ, క్యాంపస్ నవీన్ సినిమాలు తీసిన అనుభవం ఉండటంతో... 'మీరు అనుమతిస్తే మీ బయోపిక్ తీస్తాను సార్!' అన్నాను. ఆయన ఒప్పుకోవడం నాకు ఎంతో సంతోషం కలిగించింది .ఓ దర్శకుడిగా, దీనిని ఓ దృశ్య కావ్యంగా తీర్చి దిద్దగలననే నమ్మకం ఉంది.



✦ **ఆయన గొప్ప సంపాదకులుగానే తెలుసు. ఇంకా ఆయన గురించి ఏమేం చెప్పదలచుకున్నారు... ఐమీన్ చూపదల్చుకున్నారు?**

అప్పటి వరకూ కేవలం స్క్రీన్ ప్లే మాత్రమే రాసుకోవడం జరిగింది. అయితే ఈ సినిమా గురించి సోషల్ మీడియా, పేపర్లలో వచ్చాక, అనేకమంది ఆయన గొప్ప వ్యక్తిత్వం గురించీ, చేసిన సహాయాల గురించీ దేశ, విదేశాల నుండి ఫోన్లు చేసి నాతో పంచుకున్నారు. దాంతో వాటిని కూడా సినిమాలో అంతర్భాగంగా చూపుతున్నాం.

✦ **ఆయన పై మీరు ఇలా బయోపిక్ తీయాలనుకుంటున్నట్టుగా చెప్పినపుడు ఆయన స్పందన ఏమిటి?**

ఆయన మొదట స్పందించలేదు. ఒక ధ్యాన ముద్రలోకి వెళ్ళిపోయినట్టుగా ఉండిపోయారు.ఆయనికి నా సమర్థత మీద నమ్మకం ఉందో లేదో తెలియలేదు. అనవసరంగా, అతి చొరవ తీసుకుని ఇలాంటి ప్రతిపాదన వారి ముందు పెట్టానేమో అనుకున్నాను. కానీ ఆ సందర్భం మరలా రాకపోవచ్చును. ఆరోజు సుమారు మూడు నాలుగు గంటలు గడపడం జరిగింది. అందుకే అలా అడిగేసాను. తర్వాత ఆయన తేరుకుని తప్పకుండా తీయండి అన్నారు. దాంతో నాకు కొండంత బలం వచ్చేసింది.

✦ **ఇంత పెద్ద సినిమా చేయడం అందరికీ సాధ్యపడదు.అలాంటి ఈ సినిమా మొదలు పెట్టక ముందు, వారి జీవితానుభవాల గురించి రిసెర్చ్ లాంటిది ఏమైనా చేశారా?**

ఇంతకు ముందు నేను చెప్పినట్టు బలరామ్ గారిని ఫిబ్రవరి 15నే మొదటిసారి కలవడం జరిగింది. అంతవరకూ వారిని చూసింది కూడా లేదు. అయితే ఈ ప్రోజెక్ట్‌పై మునుపు ఏ రిసెర్చ్ చేయలేదు. ఇదొక భగవత్ సంకల్పం. సినిమా అనుకున్న తర్వాత మాత్రం ఆయన గురించి రిసెర్చ్ చేయడం జరిగింది. అలానే ఆయన ఇంటర్వ్యూలు కూడా చూశాను. ఆయన జీవితంలో జరిగిన సంఘటనలే చెబితే అది డాక్యుమెంటరీ అయిపోవచ్చును. అందుకే దీనిని ఓ కథగా మార్చి, పాత్రలు ప్రవేశ పెట్టి, ఆ పాత్రలకి ఒక ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని, వ్యక్తిత్వాన్ని ఆపాదించి చూపితేనే బయోఫిక్స్ ప్రేక్షకులని ఆకట్టుకుంటుంది.ప్రస్తుతం బలరామ్‌గారి లాంటి వ్యక్తి కోసమే వెతుకుతున్నాం. అలాంటి వారు ఒకరిద్దరు దొరికారు. ఇంకా కొంత ప్రయత్నం చేస్తున్నాం.

✦ **మీరు ఓ రచయితగా, బలరామ్ గారిలోని సంపాదకుడిని ఎలా నిర్వచిస్తారు?**

బలరామ్ గారి సంపాదకత్వం ఇంత విజయం సాధించడానికి , ఆయన మేధావులను పత్రిక సంపాదకులుగా నియమించుకోలేదు. ఆయనే ఓ పాఠకుడిగా మారి... రోడ్డుపై వెళ్ళే వ్యక్తి స్వాతి పత్రిక కొంటే, అందులో ఏ విషయాలు అతనికి మనోరంజకంగా ఉంటాయనే విషయాన్ని ఆయన బాగా ఆకళింపు చేసుకున్నారు. అదే ఆయని విజయ రహస్యం.


✦ **ఈ సినిమా గురించి వారు మీకు ఏమైనా సలహాలూ, సూచనలూ లాంటివి ఇవ్వడం జరిగిందా?**

సలహాలూ, సూచనలూ మేమే వారిని అడగడం జరిగినది. ఆయన వారి జీవితంలో జరిగిన అనేక ముఖ్య సంఘటనలను మాకు చెప్పడం జరిగింది. అందుకే ఓ పది రోజుల్లోనే వారిపై ఓ వీడియో పాటను చేసి వారికి పంపడం సాధ్య పడింది.

✦ **ఆయన ఎందరో సంపాదకు లకు ప్రేరణ. మరి ఆయన సంపాదకునిగా మారడానికి వారిపై ఎవరి ప్రభావం అయినా ఉందనే విషయం మీరు కనుగొన్నారా?**

ఆయనపై ఎవరి ప్రభావమూ లేదని వారి మాటల ప్రకారం తెలిసింది. అసలు ఆయన స్వాతి మాస పత్రిక ప్రారంభించడానికి గల కారణాలు చాలా విచిత్ర మైనవి. ఆయన ఘంటసాల నుండి పారిపోయి హైదరాబాద్‌కి వచ్చినది నాటకాల్లో వేషాలు వేయడం కోసం. తనలోని నటనని ప్రదర్శించడం కోసమే. అలా వచ్చి ఇక్కడి సర్వే ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తూ, సుమారు మూడు నాలుగు వేల నాటక ప్రదర్శనలు ఇచ్చారు. బాగ్‌లింగంపల్లి వినాయకుని మండపం నుండి రవీంద్ర భారతి వరకూ ఆయన ఎక్కని స్టేజి లేదు. 1965 ప్రాంతంలో సినిమా ప్రభావం అంత లేకున్నా, నాటకానికి సంబంధించిన వార్తలు ఏ పత్రికలలో రాక పోవడం ఆయన్ని బాధకి గురి చేసింది. దాంతో ఆయనే ఒక మాస పత్రికని పెట్టాలనుకున్నారు. అలా 1970 మే 29న స్వాతి మాస పత్రిక ప్రారంభించారు.

నాటక రంగానికి సంబంధించిన వార్తలు వ్రాయాలనే ఈ పత్రిక ప్రారంభం జరిగింది. కనుక ఆయన పై ఎవరి ప్రభావం లేదనే చెప్పాలి.




✦ **నలభై ఏళ్ళ పాటు ఓ పత్రికని నెంబర్ వన్ స్థానంలో నిలపడం ఆయనకి ఎలా సాధ్యపడిందని మీరు నిర్వచిస్తారు?**

బలరామ్‌గారు, ఒక సామాన్య పాఠకుడి దృక్కోణం నుండి ఆలోచించి పత్రికని ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా తీర్చిదిద్దుతారు. ఆయన ఓ మాట అంటే దానికి ఆయన కట్టుబడిపోతారు. పాఠక దేవుడు అంటే నిజంగానే వారిని దేవుళ్ళుగా భావించి అర్చించారు. పాఠకులకి కూడా బహుమతులు పెట్టడం జరిగినది. ఆయనికి వచ్చిన లాభాలని అందరికీ, అంటే రచయిత లకూ, పాఠకులకూ పంచాలనే గొప్ప మనసు వారిది. ఇరవై అయిదు వారాల పాటు ప్రతివారం ఒకపాఠకుడిని ఎంపిక చేసి లక్ష రూపాయిలు బహుమతిగా అందజేశారు. అలానే పాఠకులకి విదేశీ ప్రయాణం, బంగారు ఆభరణాలు లాంటి బహుమతులు అందజేశారు.





✦ **ఈ సినిమాని ఏదో లబ్ధి పొందాలనే నిర్మిస్తున్నారు అనే వారికి మీరు చెప్పేది.**

నేను వారి నుండి డబ్బుని ఆశించో, లేక వారిని కాకా పట్టడానికో మాత్రం ఈ సినిమా చేయడం లేదు. స్వాతిలో బహుమతి వస్తే వేలల్లో వస్తుంది. కానీ సినిమా కోట్లతో పని. నాకు ఆత్మ గౌరవం ఎక్కువ. నేను ఏ లబ్ధి కోసమో ఈ సినిమా చేయడం లేదు. ఇదొక దృశ్య కావ్యం కావాలని కోరుకుంటున్నాను... అవుతుందని నా నమ్మకం.

ప్రభాకర్ జైనీ గారి నమ్మకం నిజం కావాలని, ఒక సక్సెస్‌ఫుల్ వ్యక్తి, వ్యక్తిత్వాన్ని, సక్సెస్‌బాటని అందరికీ అర్థమయ్యేలా ఆవిష్కరిస్తారని ఆశిస్తూ... హాస్యానందం శుభాకాంక్షలు తెలియజేస్తోంది.

ఇంటర్వ్యూ: **వడ్లమన్నాటి గంగాధర్**

# చిత్ర కోరిక ఏనాటికి తీరేనో ...

మాధవి బైటారు,
+97433952728



**"నో... నహీ..." అంటూ చెవులు మూసుకుంటూ గట్టిగా అరిచారు శ్రావ్య, అరుణ్‌లు.**

**"బాబ్బాబూ... ఈ ఒక్కసారికి ఒప్పుకోండ్రా ప్లీజ్! " అంది చిత్ర బ్రతిమాలాడుతూ.**

"మాకు చాలా పనులు ఉన్నాయి!" కూడబలుక్కుని అన్నారిద్దరు.

"నిన్నడిగితే ఈ రోజు ఖాళీయే అన్నారుగా మరి!" అని చిత్ర బాణం సంధించగా... "మరి నువ్వీ విషయం గురించి నిన్న చెప్పలేదుగా!" అన్నారు తెలివిగా.

"అలా కాదురా బంగారాలు! అసలీ ఆదివారం ఎప్పుడు వస్తుందా మీరెప్పుడు దొరుకుతారా అని ఎదురు చూస్తున్నాను!" ప్రాధేయపడుతూ అంది చిత్ర.

ముందు జరిగిన అనుభవాలు దృష్టిలో పెట్టుకుని ఇద్దరూ ఏక కంఠంతో కుదరదంటే కుదరదన్నారు.

చిత్ర "పారడైజ్ నుండి బిర్యానీ తెప్పిస్తా!" అనగానే టెంప్ట్ అయినా, రాబోయే ఫలితం ఉహించి–"నాన్నని అడుగు!ఆయన కూడా ఖాళీయేగా ఈ రోజు! నువ్వడిగితే కాదనరు!" అన్నారు అప్పటికి తప్పించుకోవడానికి.

అప్పుడే బయటి నుండి వచ్చిన సుబ్బారావు చిత్ర చెప్పింది విని ఓ వెర్రి నవ్వు నవ్వి– "నావి చాలా వేశావు కదా చిత్ర! ఈసారికి వది లేయవా? ప్లీజ్!" అంటూ దీనంగా అడిగాడు.

"ఈసారి మిమ్మల్ని ఇంకా వెరైటీగా చూపించడానికి నాకో కొత్త ఆలోచన వచ్చిందండి... మెటీరియల్స్ అన్ని తెచ్చేసాను!" అనగానే

'బాబోయ్! ఏం ఐడియా వచ్చిందో నా ప్రాణానికి?' అని మనస్సులో అనుకుంటుండగా...

"ముందు మీరు ఫ్రెష్ అయి వేడి వేడి జీడిపప్పు ఉప్మా తిని అలా నా ఎదురుగా కూర్చోండి... ఇలా అంటే అలా, ఎంత? జస్ట్ గంటలోనే గీసేస్తాను! నా మాట నమ్మండి! " అని హామీ ఇచ్చింది చిత్ర.

"గంట కాదు కదా... పది గంటలు అయినా తెమలదు నీ చిత్రం. ఈ ఆదివారం కూడా గోవిందాయేనా..." అంటూ సణుక్కున్నాడు సుబ్బారావు పైకి మాత్రం పళ్ళికిలిస్తూ.

రోజంతా హాయిగా ముసుగుతన్ని సాయంత్రం ఫ్రెండ్స్‌తో సినిమాకి వెళదామని ఏవేవో ప్లాన్స్ వేసుకున్నాడు.

తన ఆశల పై నీళ్లు చల్లిన పెళ్ళాం పై మనసులోనే పళ్ళు నూరుకుని చేసేదేమీ లేక సరేనన్నాడు.

ఇక నోరుమూసుకుని చిత్ర ఎలా కూర్చోమంటే అలా కూర్చోవాలి. ఎలా నవ్వమంటే అలా నవ్వాలి... ఏ భంగిమ చెప్తే ఆ భంగిమలోనే కదలకుండా బిగదీసుకుని ఉండాలి.

ఇంతలో "అమ్మయ్య! నాన్నని ఇరికించేశాము... " అని పిల్లలిద్దరూ మెల్లగా జారుకున్నారు.

"ఒరేయ్! ఏదో ఒకటి చేసి కాపాడండ్రా!.." అని ఏడుపుముఖంతో అడుగుతున్న తండ్రితో "వియ్ కెనాట్ హెల్ప్, ఐనా నువ్వలా ఏడుస్తుంటే నీ బొమ్మ ఇంకెంత అందంగా వస్తుందో తెలుసుగా! జాగ్రత్త నాన్నోయ్!" అని గట్టిగా నవ్వుతూ చెప్పి బ్రతుకు జీవుడా అంటూ బయటికి పారి పోయారు.


చాలామంది పెళ్ళాలు టీవీలు, మొబైల్స్ చూస్తూ కాలం గడిపేస్తూ ఉంటే... నా పెళ్ళాంకి ఇదేం పిచ్చిరా దేవుడా! ఎవర్ని వదలదు, కాదేదీ కవితకనర్హం అన్నట్లు కారెవరు బొమ్మకనర్హం అంటూ కనిపించిన వాళ్లందరి బొమ్మల్ని గీసి పడేస్తుంది. వాళ్ళు వద్దు బాబోయ్ అంటున్నా... 'వదల బొమ్మాళీ నిన్నొదలా' అంటూ వెంటపడుతుంది.

అసలు దీనికంటికి కారణం ఎవరు? తనే కదా! అవును తనే!! తనకీ శాస్తి జరగాల్సిందే!" అంటూ నెత్తి కొట్టుకున్నాడు.

పెళ్ళయిన కొత్తలోని సంఘటనలు కళ్ల ముందు రింగులు రింగులుగా తిరుగుతు ఒక్కోటి గుర్తుకు రాసాగింది.

కాపురానికొచ్చిన కొత్తలో ఒకరోజు...

"ఏవండీ!... నేను బొమ్మలు బాగా గీస్తాను



తెలుసా?" అంది చిత్ర కళ్ళు గుండ్రంగా తిప్పుతూ.

"మీ బొమ్మ కూడా వెయ్యనా మరి?" అని గోముగా అడిగేసరికి మహేశ్‌బాబు, అరవింద్ స్వామిలకి ఏ మాత్రం తగ్గని అందం తనది అని భ్రమపడే సుబ్బారావు ఎప్పటినుండో ఒక మంచి చిత్రం గీయించుకోవాలనే చిరకాల వాంఛ నెరవేరుతుందని సరేనన్నాడు.

చిత్ర చెప్పిన భంగిమలో కూర్చోగానే కావాల్సిన సామాన్లు సర్దుకుని, చిత్ర గీయడం మొదలు పెట్టింది.

ఎంతకీ అవ్వదే. జస్ట్ టెన్ మినిట్స్ అని ఇప్పటికో పదిసార్లు అనుంటుంది. మన హీరో సుబ్బారావుకి నడుం నొప్పి మొదలయ్యింది. పోనీ కాళ్ళు కొద్దిగా కదుపుదామనేసరికి కాళ్ళు కదపొద్దు అని చిత్ర ఆజ్ఞ. కళ్ళు కూడా ఆర్పకుండా బొమ్మలా కూర్చోమంది.

సరే పోనీలే ఇప్పుడు కొంచెం ఇబ్బంది పడుతున్నా పైసా ఖర్చు లేకుండా పెళ్ళామే గీసిన తన బొమ్మని అందరికీ చూపించి కాలర్ ఎగరెయ్యాలి అనుకున్నాడు.

అయినా ఇంత టాలెంట్ ఉన్న పెళ్ళాన్ని ఇచ్చినందుకు ఆ దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోవాలి ముందు అని కూడా అనుకోగానే ఆనంద భాష్పాలు వచ్చాయి అతనికి.

అదిచూసి–"అయ్యో! కాళ్ళు నొప్పిగా ఉన్నాయని ఏడుస్తున్నారా?... ఇంకెంతసేపు జస్ట్ గంటలో అయిపోతుంది... అయినా మీరిలా సపోర్ట్ చేస్తుంటే నాకెంత హ్యాపీగా ఉందో తెలుసా?" అని మెలికలు తిరిగింది చిత్ర.

"నాక్కూడా చిత్ర!... నా భార్య చిత్రకారిణి అయినందుకు నాకూ గర్వంగా ఉంది... అయినా ఎంత సేపు వేస్తావు? నా బొమ్మని త్వరగా చూసుకోవాలని ఉంది!" అని ముచ్చట పడుతున్న సుబ్బారావుతో– "డన్!" అని చెప్పి తన వెనకాల దాచుకుని... "ముందు మీరు కళ్లుమూసుకోండి..." అని ఊరిస్తూ పెయింటింగ్ అతడి కళ్ళ ముందు పెట్టి...

"రెడీ.. 1... 2... 3..." అనగానే...

ఎంతో ఆత్రుతతో కళ్ళు తెరిచిన సుబ్బారావు ధడేల్న పడిపోబోయాడు.

"అసలు నేనెంత అందగాడిని. ఈ పెయింటింగ్ ఏంటి ఇలా ఉంది? అసలు ఏమైనా కొంచెమైనా నా పోలికలు ఉన్నాయా?

ఏదో సినిమాలో శ్రీహరి గీసిన... బ్రహ్మానందం పెయింటింగ్ కంటే దారుణంగా ఉండటం చూసి– 'తానే ఇంత చండాలంగా ఉంటాడా? లేకపోతే చిత్రే అంత చెత్తగా గీసిందా?' అర్థం కాక జుట్టు పీక్కున్నాడు.

పైగా ఆ చిత్రరాజాన్ని మొదటి కానుకగా ఫ్రేమ్ కట్టించి హాల్‌లో అందరికి కనపడేటట్లు వేలాడదీసింది.



ఇంటికి వచ్చిన వాళ్ళు ఆ పెయింటింగ్‌ని చూడటం ముసిముసిగా నవ్వుకోవడం–

"మీ తాతగారా లేక ఏలియనా?" అని కిసుక్కున నవ్వుతూండేసరికి సుబ్బారావు కోపం నషాళానికి అంటేది.

చిత్ర చెప్పినట్లు వినకపోతే అలిగి పుట్టింటికి ఎక్కడ వెళ్లిపోతుందో, ఆపై మామగారి నుండి ఎన్ని తిట్లు తినాల్సి వస్తుందో అని చచ్చినట్లు ఊరుకునేవాడు.

ఇదిలా ఉండగా ఇంటికి వచ్చిన అత్తమామలతో వాళ్ళిద్దరి బొమ్మలు కూడా గీస్తానంది.


కోడలి ప్రావీణ్యం తెలియని అత్తమామలు మంచి బట్టలు కట్టుకుని రెడీ అయ్యారు.

పక్కపక్కన కూర్చుంటే రొటీన్ అని, ఒకరు కళ్ళలోకి ఒకరు చూస్తున్నట్లుగా ఎదురెదురుగా కూర్చుంటే గీస్తానంది. సరేనని చిత్ర చెప్పినట్లు కూర్చున్నారు.

అప్పటికీ సుబ్బారావు తలుపు వెనక నుండి వాళ్లకు 'తప్పించుకోండి' అని సైగ చేస్తున్నా... అర్థం కాని అమాయకులు కోడలు గీసిన తమ ఫోటోని ఫ్రేమ్ కట్టించి ఊర్లో అందరికి గొప్పగా చూపిద్దామనుకున్నారు. చాలాసేపయి కాళ్ళు చేతులు లాగడం మొదలయ్యింది...

ఏదో తంటాలు పడి పూర్తి చేసిన బొమ్మ చూసి ఇద్దరికీ అర్థం కాలేదు.

"అందులో ఉన్నది తామేనా, లేకపోతే ఏదో గ్రహం నుండి వచ్చిన గ్రహాంతరవాసులా?" అని జడుసుకున్నారు.




ఇక అప్పటినుండి "ఆల్రెడి బాడీలో ఉన్న బీపీ, షుగర్‌లతోనే పడలేకపోతున్నాం. ఇక నడుం నొప్పి, కాళ్ళు నొప్పులతో మేం వేగలేం!" అంటూ ఇంటికి రావడం తగ్గించేశారు.

చిత్ర 'చిత్రకళా ప్రావీణ్యం' ఆ నోటా ఈ నోటా పాకి ఇంటికి చుట్టాలు రావడం తగ్గించేశారు.

సుబ్బారావుని బాహుబలిలా గీద్దామనుకునేది కానీ అవి కాస్తా కాలకేయుడిలా అయ్యేవి. కొత్త సినిమాలు వస్తే ఆ హీరోల గెటప్స్ వేసి బొమ్మలు గీసేది. అది చాలదన్నట్లు ఫేస్‌బుక్ లో కూడా పెట్టేది. చూసినవాళ్లు వెటకారంగా లైక్స్,కామెంట్స్ ఇస్తుంటే నిజమనుకుని భ్రమపడి రెచ్చిపోయి కొత్త కొత్త బొమ్మలు గీసి పెడుతుండేది. సుబ్బారావు అంటే గిట్టని పురుషోత్తం వాటిని అందరికి షేర్ చేస్తుండేవాడు. అలా సుబ్బారావు అందరికి అలుసై పోయాడు.

ఇక పిల్లలు శ్రావ్య, అరుణ్‌లు కొంచెం పెద్దయ్యాక వాళ్ళని కూర్చోబెట్టి వాళ్ళ బొమ్మలు గీసేది. వాళ్ళు కదలకుండా ఉండటానికి సినిమాకి, హోటల్‌కి తీసుకువెళతామని, చాకోలెట్స్ అంటూ ఆశ పెట్టేది.

కొన్నాళ్ళకి వాళ్ళు కూర్చోమని మొరాయిస్తుండేసరికి వాళ్ళ ఫ్రెండ్స్‌ని తీసుకురమ్మనేది. వాళ్లకు పిజ్జాలు, బర్గర్‌లు ఆశపెట్టేది. ఇద్దరు ముగ్గురు ఆశపడి కూర్చున్నా తర్వాత సోషల్ మీడియాలో వాళ్ళ ఫోటోలు చూసుకుని... బావురుమనేవారు.


'మీ పిజ్జాకో దండం... మీరు గీసే బొమ్మకో దండం!' అంటూ రావడం మానేశారు.

అయినా పట్టువదలని విక్రమార్కుడిలా ఎవర్ని వదిలేది కాదు. పనిమనిషి, పాలవాడు ఆఖరికి పిజ్జా డెలివరీ బాయ్‌ని కూడా. పోనీ మానేయవే అంటే ఒప్పుకోదాయె. ఇంకెవరు దొరుకుతారా అని భూతద్దం పెట్టి మరీ వెతుకుతుంది.

పాపం మన హీరో సుబ్బారావు తప్ప అందరూ పారిపోతున్నారు.

ఎప్పటికైనా 'చిత్ర గీసిన చిత్రాలు' పేరిట ఆర్ట్ ఎక్జిబిషన్ పెట్టాలని కంకణం కట్టుకున్న చిత్ర కోరిక ఎప్పటికి తీరేనో...

కాలమే నిర్ణయించాలి!







## అతనో బాల మేధావి

**తర్కారావు ప్రింటింగు ప్రెస్సు ఓనరు. జీతం పెంచమని అతని కింద పనిచేసే సుబ్బారావు ఎప్పుడొచ్చినా... అతనికి ఓ కథ చెప్పి... దాని ముగింపు చెప్తే జీతం పెంచుతానంటుంటాడు. ఇప్పుడు కూడా ఓ కథ చెప్పడం ప్రారంభించడంతో... సుబ్బారావు వినసాగాడు-**

తర్కారావ్ కాస్త గొంతు సవరించుకుని...

గబ గబా బెడ్‌రూంలోంచి హాల్లోకి వచ్చిన కాంతం– "ఏవిటి మీరు చేసిన పని! ఇలా చేస్తారని కలలో కూడా అనుకోలేదు. ఉన్నట్టుండి మీరు రోజు రోజుకీ ఆలోచన మందగించిన మనిషిలా తయారవుతున్నారనిపిస్తోంది!" అంటూ పెద్ద నోరుతో వెంగళరావ్ పై అరిచింది.

ఆమె ఏ విషయం గురించి అరుస్తోందో అర్థం కాక, కాస్త బుర్ర గోక్కుంటూ, విషయం చెప్పకుండా అలా నామీద విరగబడిపోతే... అసలు వివరం నాకెలా తెలుస్తుంది చెప్పు?" అంటూ పుస్తకం పక్కన పెడుతూ విసుగ్గా అన్నాడు.




"అర్థం కాకపోవడం ఏవిటండీ? మీ మొబైల్ ఇప్పుడే చూసాను. నేను ఎంతో ముందు చూపుతో మా చుట్టాలబ్బాయి పెళ్ళికి వెళ్దామని, మీతో డిల్లీకి నెలన్నర ముందే, చాలా చవకగా ఫ్లైట్ టికెట్స్ బుక్ చేయించాను. కానీ మీరు వారం క్రితమే నాతో చెప్పాపెట్టకుండా ఆ టిక్కెట్స్‌ని అర్ధాంతరంగా కేన్సిల్ చేసి డబ్బులు వెనక్కి తీసుకున్నారు. అవునా? కాదా?..." కోర్టులో ముద్దాయిని లాయర్ నిలదీసినట్టు నిలదీసింది కాంతం.

కొంచెం బెదురు చూపులు చూస్తూ... "అదీ... మరీ కేన్సిల్ చేసిన మాట నిజమే కానీ దాని వెనుక ఓ బలమైన కారణం ఉంది!" చెప్పాడు కాస్త నెమ్మదిగా.

అతని మాట వింటూనే– "మీకెవైనా బుద్ధుందా? అందుకే మిమ్మల్ని అందరూ బాలమేధావనేది. అయినా 'ఎప్పుడూ ముందుచూపు ఉండాలి! ముందు చూపు ఉండాలి...' అని నా మీద రాలిపోతుంటారు. అలాంటిది, ఇంకో రెండ్రోజుల్లో పెళ్ళి పెట్టుకుని ఇప్పుడిలా టిక్కెట్స్ కేన్సిల్ చేస్తే పెళ్ళికి ఎలా వెళ్తాం మీ బొంద!" అంటూ వెంగళరావ్ మీద గయ్ మంటూ లేచింది కాంతం.

ఆమె మాటలకి కాస్త ఆముదం తాగిన మొహం పెట్టిన వెంగళరావ్,

"అబ్బా! విషయం తెలియకుండా అలా విళయతాండవం చేయకు. ఇది కూడా నేను ముందు చూపుతోనే చేసాను. ఒకవేళ నేనారోజు రాశిఫలాలు చూసి అలా టిక్కెట్స్ కేన్సల్ చేయక పోతే... ఎంత డబ్బు నష్టపోయేవాళ్ళమో తెలుసా! అందుకే ఇలా చేసాను!" అని అతను అంతా విడమరిచి వివరంగా చెప్పేసరికి ఏమనాలో తెలియక గమ్మున ఉండిపోయింది కాంతం.

"ఇప్పుడు చెప్పు సుబ్బారావ్! వెంగళరావ్ అతను ఫ్లైట్ టికెట్స్ కేన్సిల్ చేయడానికి కూడా కారణం, ముందు చూపుతోనేనని చెప్పాడు. పైగా రాశిఫలాలు చూసి అన్నాడు... అలా ఎందుకు చేసి ఉంటాడంటావ్?" అడిగాడు తర్కారావ్.

"సింపుల్ సార్! ఫ్లైట్ జర్నీకి బదులు రైలు జర్నీ మంచిదని రాసుంటారు. దాంతో, అంత పెట్టి ఆ ఫ్లైట్‌లో వెళ్ళేకంటే, రైలులో వెళితే నయం అని, ఫ్లైట్ కి బదులు రైలుకి చేయించి డబ్బు కాపాడుకుందాం అనుకునుంటాడు. అంతేనా సార్!" అన్నాడు నమ్మకంగా.

"కాదు! అలా రైలుకి చేయించే వాడైతే వారం రోజుల వరకూ ఎందుకు ఆగుతాడు. కనుక పొంతనలేని సమాధానం చెప్పి పప్పులో కాలేసావ్. జరిగిందేవిటంటే, ఓ రోజు పొద్దున, అతని రాశిఫలాల్లో అనుకోకుండా శుభకార్యాలకి వెళ్ళడం రద్దు చేసుకోవాల్సి వస్తుంది... అని ఉంది. అంటే, దాని ప్రకారం ఏ కారణం చేతనైనా శుభకార్యం రేపనగా, ఆ ముందు రోజు రద్దు చేసుకోవాల్సి వస్తే, అతని టిక్కెట్స్ డబ్బు వెనక్కి రాదు... దాంతో అనవసరంగా మొత్తం డబ్బు నష్టపోతాడనే భయంతో, తనే ముందుగా ఫ్లైట్ టిక్కెట్లు రద్దు చేసేసుకుని డబ్బు వాపస్ తీసుకున్నాడు. అలా డబ్బు వృథా కాకుండా కాపాడాడని అతని భార్యతో గర్వంగా చెప్పాడు వెంగళరావ్. అతని బాలమేధావితనం మరోసారి బయటపడ్డంతో... ఏం చెప్పాలో తెలియక కాంతం గమ్మున ఉండి పోయింది. నువ్వు చెప్పలేక పోయావు కనుక ఈ సారి కూడా నీ జీతం పెంచడం జరగదు!" అని తర్కారావు చెప్పగానే...


"మీ తర్కం మీదే కానీ నా తరపు అర్థం చేసుకోరు కదా!..." అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు సుబ్బారావ్.

# నెల నెలా నవ్వుల వెన్నెల




**ప్రపంచ తెలుగు కార్టూనిస్టులు** కలిసి ఏర్పరుచుకున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు **ప్రతి నెలా ఒక అంశం మీద** హాస్యానందంలో వేసే కార్టూన్ల సమాహారం.


## ఈ నెల అంశం- నీరు-వారు











# రోజీ!



దినవహి సత్యవతి,
9790752180

**"గయ్ గయ్..." అని తారస్థాయిలో వినిపిస్తున్న భార్య గొంతుకి మెలకువ వచ్చింది జక్కయ్యకి.**

**"ఏమిటే మళ్ళీ మొదలు పెట్టావా నీ అరుపులు? తెల్లవారడం తరువాయి!" నిద్ర మంచం దిగకుండానే విసుక్కున్నాడు జక్కయ్య.**

"అక్కడ కూర్చుని మాట్లాడడం కాదు ఇలా వచ్చి వినండి మీ ముద్దుల రోజీ ఎన్నెన్ని మాటలంటోందో..."

"ఎందుకే అస్తమానం దాన్ని ఆడి పోసుకుంటావు. చూడు పాపం ఎలా బిక్క ముఖం వేసిందో?"

"ఆ...ఆ...అలాగే దాన్ని సమర్థిస్తూ ఉండండి ఏదో ఒకరోజు అది మనిద్దరిని ఇంట్లోంచి తరుముతుంది!" మెటికలు విరిచింది గుండమ్మ.

"ఇంతకీ అదేమందో చెప్పవే నీ గోల ఆపి!"

"మనమేమో హాయిగా ఎ.సి. లో పడుకుని దాన్ని ఎండలో మగ్గ బెడుతున్నామట!"

"నిజమే కదా పాపం దాన్ని కూడా మనతో పాటే పడుకోబెట్టుకుంటే పోలా!"

"ఆ...పోతుంది కాదు...కాదు...పోయింది మీకు మతి. లేకపోతే ఏంటీ దీన్ని మనతో పడుకో బెట్టుకోవాలా? అసలు అదెక్కడ మనమెక్కడా? కాస్తైనా తెలివిఉండే మాట్లాడుతున్నారా?" తలబాదుకుంది.

"ఏయ్ గుండూ! ఏమిటే ప్రేలుతున్నావు?" గయ్యిన అరిచింది రోజీ.

అప్పటిదాకా రోజీని సమర్థిస్తున్న జక్కయ్య దాని ధాటికి తారుకుని భార్య వెనక నక్కాడు.


"ఇప్పుడర్థమయ్యిందా అయ్యగారికి నేనెంత వద్దన్నా వినకుండా, మనకెలాగు పిల్లలు లేరు కనీసం ఈ రోజీ కబుర్లైనా విని సంతోషిద్దామే అని ఎవడో వెధవ చెప్పాడని హిమాలయాలకు మరీ వెళ్లి తెచ్చి తినిపించారుగా మాటలు వచ్చే మూలిక, ఇప్పుడు చూడండి ఇది ఏకు మేకై కూర్చుంది!"

"ఇప్పుడేం చేద్దామే?" అయోమయంగా అడిగాడు.

"వెంటనే మీకు చచ్చు సలహా ఇచ్చిన ఆ ముచ్చు వెధవ దగ్గరికే మళ్ళీ పోయి, సంగతి చెప్పి దీని నోరు మూతబడే మందు తెచ్చి మింగించండి!" ఉరిమింది.

"ఏయ్ గుండమ్మ జక్కయ్యా అలా గనక చేస్తే మిమ్మల్ని గృహ హింస చట్టం క్రింద కేసు నమోదు చేసి ఊచలు లెక్క పెట్టిస్తాను జాగ్రత్త!" దర్జాగా ఊపుకుంటూ ఎ.సి. గదిలోకి వెళ్లి మంచం పైన ముడుచుకుని హాయిగా పడుకుంది రోజీ.

అంతే గుండమ్మ జక్కయ్య నిశ్చేష్టులై చూస్తుండిపోయారు తమ ముద్దుల రోజీ ఉర్ఫ్ బుజ్జి కుక్క పిల్ల ఏడాది లాబ్రడార్ని!






**గతంలో...** అమెరికాలో స్థిరపడ్డా బ్రహ్మచారి చందు. అందరికీలానే చందు పెళ్ళికోసం తండ్రి తన మరదలు సుబ్బలక్ష్మిని పెళ్ళి చేసుకోమని నెత్తినోరు కొట్టుకుని మొత్తుకుంటుంటాడు. తనకి మరదలు మీద ఏ ఫీలింగ్ లేదని చందు తెగించి చెప్పేస్తాడు. మూడు నెలల్లో యోగ్యురాలైన అమ్మాయిని తెచ్చి మా ముందు పెట్టు... లేదంటే చచ్చిపోతానని బెదిరిస్తూ తండ్రి ఈమెయిల్ పంపిస్తాడు. అమ్మాయిని వెతికే పనిలో ఉంటాడు చందు. మెక్సికన్ కిడ్నాపర్ ఓలేకి, సుబ్బు ఒక ఫోటో ఇచ్చి, ఆ అమ్మాయిని కిడ్నాప్ చేయమని చెప్తాడు. ఆ అమ్మాయి తెలంగాణ అసోసియేషన్ వారు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో 6వ అయిటమ్ చేసే అమ్మాయని చెప్తాడు. ఆ కార్యక్రమం అయిపోయాక సౌమ్యను కిడ్నాప్ చేసి, ఒక గదిలో బంధిస్తాడు ఓలే!.... సౌమ్య ఓలేని నానా విధాలుగా ఇబ్బంది పెడుతుంటుంది. ఆమె పెట్టే ఇబ్బందులు భరించలేక ఆమెని విడుదల చేస్తాడు ఓలె. ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే యిచ్చి ఇందు పెళ్ళి చేయాలనుకుంటుంటాడు. ఆంధ్ర కుర్రాడు చందుని ఇష్ట పడుతుంది ఇందు. అయితే ఇందు నాన్న తెలంగాణ అబ్బాయికే ఇందునిచ్చి పెళ్ళి చేయాలనుకునేందుకు కారణం వంద సంవత్సరాల గతంలోకి వెళ్ళాల్సిందే... అలా వెళ్ళాక... సుబ్బారావు. అప్పన్నలు పోలీస్ ట్రైనింగ్ కోసం హైదరాబాద్ వెళతారు. గోల్కొండ కోట దగ్గర్నుంచి ఒక పొట్టి వ్యక్తి వీళ్ళను వెంబడిస్తుంటాడు. సుబ్బారావు, అప్పన్నలు ఒక పార్టీకి వెళతారు. అక్కడోహత్య జరిగి, ఒక నక్లెస్ దొంగిలించబుతుంది... పోలీసులు ఎన్క్వైరీ చేస్తుంటారు.

**(ఏప్రిల్ సంచిక తరువాయి)**

**అడవిలో ట్రైనింగ్ అంటే ఇవే సమస్యలు... ఉసిరి కాయంత సైజు దోమలు, ఎలుకలు, మిడతలు, పాములు, ముళ్ళు! ట్రైనింగుకే పరిస్థితి ఇలా ఉంది, నిజంగా అడవిలో డ్యూటీలు చేయాల్సి వస్తే ఇంకెలా ఉంటుందో! ఎందుకొచ్చిన పోలీసు ఉద్యోగం! ఇలా అనుకుంటూ, సుబ్బారావు రాత్రంతా నిద్రపోకుండా గడిపాడు.**

**తెలతెలవారుతుండగా, మళ్ళీ ఉత్తరం రాసి, తీసుకెళ్ళి జాక్సన్ దొరగారు ఆఫీసులా వాడే ఓ గుడారంలో, బల్ల మీద ఉత్తరాన్ని ఉంచి వచ్చాడు.**

**అడవిలో ఆరోజు చెట్లు ఎక్కడం పై, పక్షికూతలు వినడం పై ట్రైనింగ్. పోలీసులు, తమతమ యూనిఫారాలు ధరించి రెడీ అవుతుంటే, జాక్సన్ దొర నుండి సుబ్బారావు కు పిలుపు వచ్చింది. సుబ్బారావు, అప్పన్న వంక చూసాడు.**

అప్పన్న షూ పాలిష్ చేసుకుంటూ, చిరు నవ్వు నవ్వుతూ,– "ఊ... వెళ్ళండి సుబ్బారావు గారు! ఆల్ ద బెస్ట్!" అన్నాడు.

అప్పన్న నవ్వు, సుబ్బారావుకు కంపరాన్ని కలిగించింది.

సుబ్బారావు, జాక్సన్ దొర దేరాలోకి అడుగు పెట్టి, సెల్యూట్ చేసి నిలబడ్డాడు.

"వాట్ సుబ్రావ్? కళ్ళు ఎర్రగా ఉన్నాయి? నిద్రపోలేదా?"

"లేద్సార్!"

"ఎందుకు?"

"అదీ...అదీ..."

"ప్యాంటులో ఎలుక దూరింది, ముక్కులోకి దోమ దూరింది, తాచుపామొచ్చి...కళ్ళకు చుట్టుకొని పడుకుంది... లాంటి ఏదో ఓ కారణం అయ్యుంటుంది. అంతేగా?" అన్నాడు జాక్సన్.

సుబ్బారావు ఆశ్చర్యంగా చూస్తూ– "మీకెలా తెలుసు సార్?..." అన్నాడు.

"నేనూ, మొదటిసారి అడవుల్లోకి ట్రైనింగ్ కోసం వెళ్ళినప్పుడు...ఓ పెద్ద పురుగు నేనున్న గుడారంలోకి వచ్చింది. దాన్ని తినడం కోసం ఓ పక్షి వచ్చింది. ఆ పక్షిని తినడం కోసం వచ్చిన ఓ పిల్ల కట్లపాము, నా విస్కీ బాటిల్‌కు చుట్టుకొని పడుకుంది. ఆ రోజు నిద్రపోతే ఒట్టు. ఓసారి, నా పై అధికారి ప్యాంట్ లో కూడా ఎలుక దూరింది. ఆయన ప్యాంట్ విప్పేసి... కేకలు పెడుతూ అడవిలో ఉరుకో ఉరుకు!! తలుచుకుంటే, ఇప్పటికీ నవ్వు ఆగదు. ఇలా... అడవుల్లో, నాకు ఎన్నో మధురస్మృతులు ఉన్నాయి!" అన్నాడు జాక్సన్.

"చిత్తం! నా ప్యాంట్లోకి ఎలుక దూరింది సార్! నిద్ర పాడయ్యింది." అన్నాడు సుబ్బారావు.

"ఓ! దట్స్ ఫన్నీ. మరి, మీ అరుపులు, కేకలు వినిపించలేదేం?" అడిగాడు జాక్సన్ దొర.

"అంటే, షాక్‌లో అలాగే ఉండిపోయాను సార్!" అన్నాడు సుబ్బారావు.


"ఎనీ వే... ఉత్తరం చాలా బాగా రాసారు. ఒక్క తప్పు...ఒక్కటంటే ఒక్క తప్పు కూడా లేదు. వాక్య నిర్మాణమూ బాగుంది!" మెచ్చుకున్నాడు జాక్సన్.

"థాంక్ యూ సర్!" అన్నాడు సుబ్బారావు, ఊపిరి పీల్చుకుంటూ.

"ఈరోజు సాయంత్రానికి, నా పై ఆఫీసర్ నిక్సన్ దొరగారు, ఇక్కడ ట్రైనింగ్ ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికి వస్తున్నారు. ఈ విషయం గురించి, ఆయనతో మాట్లాడతాను. ఆయన వేసే ప్రశ్నలకు సిద్ధంగా ఉండండి!" అన్నాడు జాక్సన్.

"ప్రశ్నలా?" అన్నాడు సుబ్బారావు.

"అదే... ఆయనకేమైనా సందేహాలు ఉంటే... అడుగుతారు కదా! ఎందుకంటే... మనం పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉండి... ఇతర



పోలీసులను ఎవరినైనా అరెస్ట్ చేయించాలి అంటే, లీగల్ కాంప్లికేషన్లు లేకుండా, కొంత ముందు జాగ్రత్త అవసరం!" అన్నాడు జాక్సన్.

"ఓకే సర్!" అన్నాడు సుబ్బారావు.

"నీకు రామాయణం తెలుసా?" అడిగాడు జాక్సన్.

"తెలుసు సార్!... నేను చిన్నప్పుడు మా తాతయ్య నుండి విన్నాను సార్!... అందులో రాముడు, సీత, లక్ష్మణుడు...అడవికి వెళతారు సర్!... అయితే..." సుబ్బారావు చెప్పుకు పోతున్నాడు.

"స్టాప్!" అన్నాడు జాక్సన్.

సుబ్బారావు ఠక్కున ఆగిపోయాడు.

"నాతో మాట్లాడినట్లు నిక్సన్ గారితో మాట్లాడితే కుదరదు. వారు చాలా స్ట్రిక్ట్. అడిగిన ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పాలి. అనవసరంగా ఒక్క మాట ఎక్కువగా మాట్లాడినా... వారికి కోపం వస్తుంది." అన్నడు జాక్సన్.

"ఎస్ సార్!" అన్నాడు సుబ్బారావు.

"ఏది ఇప్పుడు చెప్పు.నీకు రామాయణం తెలుసా?" అడిగాడు జాక్సన్.

"తెలుసు సర్!"

"ఆ..ఇలా అడిగిన ప్రశ్నకు మాత్రమే ఆన్సర్ ఇవ్వాలి. గుర్తుంచుకో!"

"ఎస్ సర్!"

"ఇక నువ్వు వెళ్ళొచ్చు!" అన్నాడు జాక్సన్.

జాక్సన్ దొర, తన పై అధికారితో ఈ విషయాన్ని ఇంత త్వరగా చర్చించే అవకాశం




రావడం ఒకందుకు మంచిదే... ఇక అప్పన్న తప్పించుకోలేడు!' మనసులో అనుకుంటూ...

"సరే సర్!" అని సుబ్బారావు సెల్యూట్ చేసి, డేరా బయటకు నడిచాడు సుబ్బారావు.

నిక్సన్‌ను పిలుచుకు రమ్మని, జాక్సనే నిన్న రాత్రి ఒక మనిషిని సిటీకి పంపిన సంగతి సుబ్బారావుకు తెలియదు. అది కూడా సుబ్బారావు, అప్పన్న మీద ఇచ్చిన కంప్లైంట్ గురించి చర్చించడానికే! నిక్సన్‌ను, జాక్సన్ పిలిచాడని, సుబ్బారావుకు అసలే తెలియదు.


అడవిలో, పోలీసులకు చెట్లు ఎక్కే ట్రైనింగ్ ప్రారంభం అయ్యింది. మధ్యలో, అరగంట సేపు టీ బ్రేక్ ఇచ్చారు.

"మద్ది చెట్టు ఎక్కుతుంటే... మానుపై పాకుతున్న ఎర్ర చీమల దండు... నా పై దాడి చేసి కుట్టికుట్టి పెట్టాయి. క్రితం జన్మలోని నా శతృవులందరూ ఈ చెట్టుపై చీమల్లా జన్మించినట్లున్నారు. నాకు పాములన్నా భయం లేదండీ, వాటితో పోరాడడానికి ఓ పద్ధతి ఉంది... కానీ, వెధవది ఈ చీమలు, దోమలు, ఈగలు, చూసేందుకు చిన్నవిగా ఉంటాయి కానీ, వాటితో ఎలా పోరాడాలో ఇప్పటి వరకు తెలియదు." అని ఒక పోలీస్ ఏడుపు మొహంతో అన్నాడు.

"మర్రి చెట్టు మీదికి ఎక్కాక, ఓ పక్షి గూడులో ఉన్న గుడ్లు ఎత్తుకుపోవడానికి వచ్చానేమోనని అనుమానంతో ఆ పక్షి మొగుడు తన ముక్కుతో నా నెత్తి మీద పోట్లు పొడిచాడు." అని ఇంకో పోలీస్ వాపోయాడు.

"నేను వెలగచెట్టు చెట్టు ఎక్కలేక నానాచావు చచ్చాను. నా ప్యాంట్, చిరగరాని చోట చినిగింది. తాకరాని చోట దెబ్బలు తాకాయి. నేను జారి కిందపడుతుంటే, దానికి తోడు ఓ వెలగ పండు నా భుజం పై పడింది. అదే గనక నా నెత్తి మీద పడుంటే... ఈ పాటికి హరీమనే వాడిని!" అన్నాడు ఓ పోలీస్.

"అయినా, మనం పోలీసులం. మనకు ఈ చెట్లు ఎక్కాల్సిన ఖర్మ ఏమిటండీ? ఎంచక్కా లాఠీ పట్టుకుని, అమలాపురం జంక్షన్‌లో నిలబడి, విజిల్ వేస్తూ డ్యూటీ చేస్తుంటే ఆ సంతోషమే వేరు. ఈ చెట్లు గట్రా ఎక్కడం నా వల్ల కాదు బాబోయ్!... అసలు, చిన్నప్పుడు కోతి



కొమ్మచ్చి ఆడడం కోసం జామ చెట్టు ఎక్కితే, మా నాన్నగారు నా వీపు మీద గుద్ది, చెవులు మెలేసి, వీధిలోనే తన్నిన చోట తన్నకుండా తంతూ, ఇంటికి లాక్కుపోయారు. అదిగో... ఆ రోజు నుండి చెట్లు ఎక్కాలంటే భయం. ఇప్పుడు కూడా, చెట్టు ఎక్కుతుంటే, ఏవైపు నుండి మా నాన్నగారు వచ్చి నన్ను తంతారో అని గుండెల్లో ఏదో భయం. పైగా ఈరోజు నన్ను ఓ ఉసిరి చెట్టు ఎక్కించారు." అన్నాడు ఇంకో పోలీస్.

"మీరు కాస్త నయం. నన్ను ఓ రావి చెట్టు ఎక్కించారు. దాని కొమ్మల్లో, ఏం దాచుకున్నాయో తెలీదు గానీ...వాటి సిగతరగ, రెండు రౌడీ కోతులు, ఇంతింత పారపళ్ళేసుకొని, నా మీదికి దూకాయి... హడలి చచ్చాను అనుకోండి!" అని సుబ్బారావు చెప్పాడు.

"నేను, బాదాం చెట్టు ఎక్కాను. అబ్బబ్బబ్బబ్బ...అడవి బాదాం కాయలు ఎంత రుచిగా ఉన్నాయో. ఇలా నోట్లో పెట్టుకున్నానో లేదో, అలా కరిగిపోతున్నాయ్. అవి బాదాం కాయలా?... కాదు, వెన్నముద్దలు!" అన్నాడు అప్పన్న.

అందరూ అప్పన్న వంక ఈర్ష్యగా చూసారు.

'ఇంకెంతసేపులే, నిక్సన్‌దొరగారు రాగానే, నువ్వు తిన్న బాదాంకాయలు కక్కిస్తారు.' అని మనసులో అనుకున్నాడు సుబ్బారావు.

అంతలో...

ఓ అటెండర్ వచ్చి–

"సుబ్బారావ్! మిమ్మల్ని నిక్సన్ దొరగారు పిలుస్తున్నారు!" అని చెప్పాడు.

సుబ్బారావు సంతోషంగా... "పద పద!" అంటూ, ఓసారి అప్పన్న వంక చూసాడు.

అప్పన్న, ఏమాత్రం టెన్షన్ లేకుండా, ఓ బాదాం పండు పీక్కుతింటున్నాడు.

ఓ పెద్ద మర్రి చెట్టు కింద, టేబుల్, రెండు కుర్చీలు వేసి ఉన్నాయి. కుర్చీలలో, నిక్సన్, జాక్సన్ కూర్చుని ఉన్నారు.

సుబ్బారావు వెళ్ళి, వాళ్ళకు సెల్యూట్ చేసి, నిలబడ్డాడు.

నిక్సన్, సుబ్బారావు వంక చూసి–

"నీ ఉత్తరం చదివాను!" అన్నాడు.

సుబ్బారావు–"థాంక్యూ సర్!" అన్నాడు.

"అన్నట్టు, నీకూ...అప్పన్నకు మధ్య ఏమైనా గొడవలు ఉన్నాయా?" అడిగాడు నిక్సన్.

"లేద్సార్!"

"మరి, అతడు నీ సాటి పోలీస్ కదా! అతని పై ఎందుకు కంప్లైంట్ ఇస్తున్నావ్?"అడిగాడు నిక్సన్.

"సార్! అప్పన్న ఆ హారం కొట్టేసాడనేది నా అభియోగం సార్! నేను, దొంగను వదిలే ప్రసక్తే లేదు. మాది నిప్పులు కడిగిన వంశం సార్!" అన్నాడు సుబ్బారావు.

"మాది చిప్పలు కడిగిన వంశం... అన్ని విషయాలు శుభ్రంగా కడిగిన చిప్పలా, క్లీన్‌గా విచారిస్తాను. నిజాం ఇచ్చిన విందులో... అప్పన్న ఆ నెక్లెస్ దొంగతనం చేయడం నువ్వు చూసావా?" అడిగాడు నిక్సన్.

"లేద్సార్."

"మరి?"


"చిత్తం, నేను ఉత్తరంలో రాసినట్లుగా రాత్రి అప్పన్న తన దుస్తులలో నుండి ఒక వజ్రాల నెక్లెస్‌ను తీసి, నల్లదుస్తులలో ఉన్న వ్యక్తికి ఇవ్వడం నేను చూసాను!" అన్నాడు సుబ్బారావు.

"మరి, నీ ఉత్తరంలో 56 వజ్రాలు పొదగబడి ఉన్న వజ్రాల నెక్లెస్ అని రాసావు?"


"చిత్తం!"

"అంటే, ఆ చీకట్లో అప్పన్న, నల్లదుస్తుల వ్యక్తికి వజ్రాలహారం ఇస్తున్నప్పుడు, అందులో 56 వజ్రాలున్నాయని లెక్క పెట్టావా?"

"లెక్క పెట్టలేదు సర్!" **(సశేషం)**




సమర్పించు కార్టూన్



సృష్టిలో నవ్వే లక్షణం ఒక్క మనిషికే ఉంది !
విచారించడానికి సవాలక్ష కారణాలు!
డామిట్!... ఇందుకేనా మనుషులున్నది?
ఆ సవాలక్ష కారణాలని మరుగున పడేయడానికే

హాస్యానందం

చందాదారులుగా చేరండి...
నవ్వే లక్షణాన్ని మీ స్వంతం చేసుకోండి!

| సంవత్సర చందా- రూ 300/-లు | రెండేళ్ళ చందా- రూ 500/-లు |
| --- | --- |

జీవితచందా- రూ 5000/-

ఇంటిల్లీ పాదినీ నవ్వించే పని పెట్టుకున్న ఏకైక తెలుగు మాస పత్రిక





జీవిత చందాదారులకు ఆఫర్లు:

- ✦ వీరికి పత్రిక ప్రతినెలా రిజిష్టర్ పోస్ట్‌లో పంపబడుతుంది.
- ✦ సంవత్సరంలో ఒక నెల వీరి కోరిక మేరకు 'శుభాకాంక్షలు' ప్రకటన ప్రచురిస్తాం!

మరిన్ని వివరాలకు
9 8 4 9 6 3 0 6 3 7 నెంబరకు
సంప్రదించండి!


Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P



చవకబారు వస్తువులు విలువైనవి
కావు...
విలువైన వస్తువులు చవకగా
ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street, Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

Hasyanandam June-2023. RNI No. APTEL 08387/01/1/2003-TC



రండి! దర్శించండి!! తరించండి!!!

# శ్రీ అష్టాదశ శక్తిపీఠ సహిత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం

కీ॥శే॥ శ్రీ గట్టు రాం రాజేశం గుప్తగారి సత్సంకల్పముతో...

గౌ॥ శ్రీమాన్ కె.వి.రమణాచారి IAS, Retd గారి పర్యవేక్షణలో...

## ఆనంద నిలయం ఆవరణలో
## గ్రా॥ కొండపాక. జి॥ సిద్ధిపేట

అమ్మవారి అనంతరూపాలలో అష్టాదశ శక్తి స్వరూపాలు అత్యంత శక్తివంతమైన రూపాలు. ఒక్కో రూపం ఒక్కోరకంగా ప్రభావవంతమైనది. అమ్మవారి ఆవిర్భావంతో, మన భారతావని పవిత్ర పుణ్యక్షేత్రంగా విరాజిల్లుచున్నది. అంతటి గొప్ప మహిమాన్విత శక్తిపీఠ క్షేత్రంగా భారతదేశంలో, మన తెలంగాణ రాష్ట్రంలో సిద్ధిపేట జిల్లాలోని కొండపాక గ్రామంలో ఆగమశాస్త్ర విధానంలో వాస్తురీత్యా చక్కని శిల్పసంపదతో నాణ్యత గల నిర్మాణముతో శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధీశ్వరుల.... ఆశీరనుగ్రహ నిర్వహణలో త్యాగధనుల విరాళములతో ఒక అద్భుతమైన అష్టాదశ శక్తి క్షేత్రంగా శాస్త్రీయ విధానంగా అతి త్వరలో వైభవోపేతంగా ప్రతిష్ఠింపబడుతున్నదని తెలుపుటకు సంతోషిస్తున్నాం. ఇంకా నిర్మాణంగా నున్న, రాజగోపురం, ధ్యాన మండపం, యజ్ఞశాల, వంటశాల, అర్చకుల గృహసముదాయం, భక్తులకు నివాస వసతి గృహసముదాయం అనేక హంగులతో సొబగులతో నిర్మించుటకు సంకల్పించినాం. ఇంతటి గొప్ప విశిష్ఠత గల వైభవోపేతమైన ఈ శాస్త్రీయ అష్టాదశ శక్తిపీఠ రామలింగేశ్వర స్వామి క్షేత్రానికి భక్తులు, దాతలు యధామతిగా యధారీతిన తమ తమ శక్త్యానుసారంగా తను, మన, ధన, సేవా సహకారాలందించి ఈ పవిత్ర పుణ్యకార్యక్రమంలో యధోచితంగా పాల్గొనగలరని సకల భక్తజనావళిని సాదరపూర్వకంగా ఆశిస్తూ ఆహ్వానిస్తున్నాం.

**ఆలయ ట్రస్టు సభ్యులుగా చేరడానికి రూ.3,00,000 విరాళం అందించి శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కండి!**

ట్రస్ట్‌కు ఇచ్చే విరాళాలకు ఇన్‌కంటాక్స్ 80-జి సెక్షన్ ప్రకారం ఆదాయపు పన్ను మినహాయింపు ఉంది.

**Provisional Approval Number AAHTA 8091JF20206**

Ashtadasha Shakthi Peetha Sahitha Ramalingeswara Swamy Charitable Trust,
A/C.No-39153802660, IFSC-SBIN005881, Branch: SBI, ADB, Siddipet

వివరాలకు సంప్రదించండి:

శ్రీ అయిత నాగరాజు-9583599999, శ్రీ పెద్ది వైకుంఠం-9440003943, శ్రీ గట్టు రవీందర్-9848504656